మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 13-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 45 Issue: 45

13 ఆగస్టు 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:02 సూర్యాస్తమయం - సా. 6:39 తిథి పాడ్యమి రా. 8:45 వరకు తరువాత విదియ సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం ఆశ్లేష ఉ. 6:03 వరకు తరువాత పూర్వ ఫల్గుని(పుబ్బ) యోగం వారియ మ. 12:13 వరకు కరణం స్తుఘ్నము ఉ. 9:53 వరకు బవ రా. 8:45 వరకు వర్జ్యం సా. 5:22 నుండి సా. 6:52 వరకు దుర్ముహూర్తం ఉ. 10:14 నుండి ఉ. 11:05 వరకు మ. 3:17 నుండి సా. 4:08 వరకు రాహుకాలం మ. 1:55 నుండి మ. 3:30 వరకు యమగండం ఉ. 6:02 నుండి ఉ. 7:36 వరకు గుళికాకాలం ఉ. 9:11 నుండి ఉ. 10:46 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:26 నుండి తె. 5:14 వరకు అమృత ఘడియలు తె. 4:36 నుండి ఉ. 6:05 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:55 నుండి మ. 12:46 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial




## కల్యాణలక్ష్మి చెక్కులు ఇవ్వొద్దు

### పథకంపై తెలంగాణ హైకోర్టు స్టే.. రాష్ట్ర ప్రభుత్వానికి కీలక ఆదేశాలు

హైదరాబాద్, ఆగస్టు 12 (ఈవార్తలు): రాష్ట్రంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు స్టే విధించింది. తదుపరి విచారణ వరకు ఈ పథకం కింద ఎలాంటి చెక్కులు మంజూరు చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ వ్యాజ్యంపై గత విచారణ సందర్భంగా కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. అయితే 4 వారాలైనా కౌంటర్ దాఖలు చేయలేదని న్యాయవాది విజయ్ గోపాల్ హైకోర్టుకు తెలిపారు. దీంతో ఈ పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వులు ఇస్తూ, విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాలకు చట్టబద్ధత లేదంటూ హైకోర్టు న్యాయవాది విజయ్ గోపాల్ పిటిషన్ దాఖలు చేశారు. 2014 నుంచి ఇప్పటివరకు ఈ పథకం కింద దాదాపు రూ.16 వేల కోట్లు పంపిణీ చేశారని, కానీ ఈ పథకాన్ని చట్టసభల్లో తరువాయి 2 వ పేజీలో...




## ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ చెల్లదు

### ఎన్నికల సంఘం స్పష్టీకరణ.. రేషన్ కార్డుతో సమానమని వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 12 (ఈవార్తలు): తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా, 'ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్'ను గుర్తింపు పత్రంగా అంగీకరించబోమని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) స్పష్టం చేసింది. ఈ సర్టిఫికెట్ల జారీపై గత కొంతకాలంగా నెలకొన్న గందరగోళానికి ఈసీఐ తాజా ప్రకటనతో తెరపడింది. రేషన్ కార్డు (ఆహార భద్రత కార్డు) డేటా ఆధారంగా తెలంగాణ ప్రభుత్వం జారీ చేస్తున్న ఈ సర్టిఫికెట్, రేషన్ కార్డుతో సమానమని ఎన్నికల సంఘం తన వివరణలో పేర్కొంది. ఓటర్ల పరిశీలన ప్రక్రియలో రేషన్ కార్డును ధ్రువీకరణ పత్రంగా పరిగణించనందున, ఈ సర్టిఫికెట్‌ను కూడా అంగీకరించలేమని తేల్చిచెప్పింది. మీసేవ కేంద్రాల ద్వారా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లను జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జులై 25న ఉత్తర్వులు తరువాయి 2 వ పేజీలో...



## మేడిగడ్డ.. కేసీఆర్‌కు మళ్లీ నోటీసులు

### భూపాలపల్లి జిల్లా కోర్టు కీలక ఆదేశాలు

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుకు కోర్టు మళ్లీ నోటీసులు జారీ చేసింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు కేసు విచారణకు సంబంధించి కేసీఆర్ కు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు మరోసారి నోటీసులు జారీ చేసింది. గతంలో కోర్టు ద్వారా జారీ అయిన నోటీసులు కేసీఆర్‌కు సక్రమంగా చేరలేదని వెల్లడవ్వడంతో.. న్యాయస్థానం తాజాగా ఈ నిర్ణయాన్ని తీసుకుంది.

భూపాలపల్లి, ఆగస్టు 12 (ఈవార్తలు): గత విచారణల సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్‌కు పంపిన నోటీసులు ఆయనకు అందలేదని తేలడంపై న్యాయమూర్తి.. ఈసారి ఎలాంటి సాంకేతిక విఘాతాలు లేదా డెలివరీ సమస్యలు తలెత్తకుండా పక్కాగా నోటీసులు అందజేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. నోటీసుల జారీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, ప్రతివాదికి సమాచారం అందినట్లు రుజువులను తరువాయి 2 వ పేజీలో...

## మన గోదావరి.. మనకే



### జలాలు గరిష్ఠంగా వాడుకోవాలి

### ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ నుంచి ఎత్తిపోతలు

### కాళేశ్వరం బరాజ్‌ల భద్రతపై ఎన్డీఎస్ఏ సూచనలు పాటించాలి

### అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

గోదావరి నదీ జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా నీటి ఎత్తిపోతల (లిఫ్ట్) ప్రక్రియను ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నీటిపారుదల శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) సిఫార్సుల మేరకు ప్రస్తుతం సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలలో నీటిని నిల్వ చేయడం లేదని ముఖ్యమంత్రి గుర్తుచేశారు.

హైదరాబాద్, ఆగస్టు 12 (ఈవార్తలు): ఎన్డీఎస్ఏ మార్గదర్శకాలను అధికారులు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలలో కొన్ని లోపాలను గుర్తించినట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించగా, ఈ అంశంపై తక్షణమే ఎన్డీఎస్ఏను సంప్రదించాలని సీఎం సూచించారు. దేవాదుల ప్రాజెక్టులో తొమ్మిది పంపుల ద్వారా నీటిని లిఫ్ట్ చేయడం కీలకమని, అక్కడ ఎదురవుతున్న చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన రైతులకు చెల్లించాల్సిన పరిహారంపై కూడా ఈ సమావేశంలో సమీక్షించారు. నష్టపరిహారాన్ని తక్షణమే చెల్లించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ముంపునకు గురయ్యే గ్రామాలు, పెండింగ్ పరిహారం, పునరావాస ప్యాకేజీలపై తరువాయి 2 వ పేజీలో...

## 60 ఏళ్లకు మీకు ఎమ్మెల్సీ..



### 30 ఏళ్ల మాకు ఉద్యోగం వద్దా?

### ప్రొఫెసర్ కోదండరాంకు నిరుద్యోగుల సెగ

### సోమాజిగూడ ప్రెస్ క్లబ్ వద్ద తీవ్ర ఉద్రిక్తత

ఎమ్మెల్సీ, తెలంగాణ జన సమితి చీఫ్ ప్రొఫెసర్ కోదండరాంకు నిరుద్యోగుల నుంచి తీవ్ర నిరసన సెగ తగిలింది. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ వేదికగా ప్రభుత్వ ఉద్యోగాల వయోపరిమితి పెంచే అంశంపై మాట్లాడేందుకు వచ్చిన కోదండరాంను నిరుద్యోగ యువత అడ్డుకుని, నిలదీశారు. ఒక్కసారిగా నిరుద్యోగులు పెద్ద ఎత్తున చుట్టుముట్టడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

సోమాజిగూడ-హైదరాబాద్, ఆగస్టు 12 (ఈవార్తలు): ఈ సందర్భంగా నిరుద్యోగులు తమ ఆవేదనను వెళ్లగక్కుతూ ఎమ్మెల్సీ కోదండరాంను ప్రశ్నలతో నిలదీశారు. 'మీరు 60 ఏళ్ల వయస్సులో కూడా సుప్రీంకోర్టు దాకా వెళ్లి ఎమ్మెల్సీ పదవి తెచ్చుకోవచ్చు.. కానీ మేము 30 ఏళ్లకు అన్ని అర్హతలు ఉండి ఉద్యోగం చేయడానికి పనికిరామా?' అని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో మీరు చెప్పినందుకే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశాం. తీరా అధికారంలోకి వచ్చాక మా వయోపరి మితి పెంపు, నోటిఫికేషన్ల సమస్యలపై మీరు ఎందుకు మాట్లాడటం లేదు?' అని నిలదీశారు. తమ సమస్యలను, ఏళ్ల తరబడి పడుతున్న మానసిక వేదనను మీడియా కూడా సరిగ్గా పట్టించుకోవడం లేదని కన్నీటి పర్యంతమయ్యారు. ఇప్పటికైనా నిరుద్యోగుల వయోపరి మితి పెంపు అంశాన్ని వెంటనే ప్రభుత్వం దృష్టికి, మీడియా దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోదండరాంను డిమాండ్ చేశారు.

## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,486 |
| వెండి (కిలో): | రూ.2,60,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,362 |

## విశ్వవాణి



రష్యా-ఉక్రెయిన్ మధ్యవర్తిగా చంద్రచూడ్

మాస్కో: రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉక్రెయిన్‌కు చెందిన ప్రభుత్వ రంగ బ్యాంకు 'ఓస్చాడ్‌బ్యాంక్'తో నెలకొన్న పెట్టుబడుల వివాదంలో రష్యా తమ తరపు మధ్యవర్తిగా (ఆర్బిట్రేటర్) భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డి.వై. చంద్రచూడ్‌ను నియమించింది.

## జీవితంలో షార్ట్ కట్‌లు వద్దు

### ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్‌తో జాగ్రత్త.. జెన్-జీకి ప్రధాని మోదీ సూచన

### మాజీ రాష్ట్రపతి కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణ

జీవితంలో షార్ట్ కట్‌ల కోసం చూడొద్దని ప్రధాని మోదీ నేటి తరం యువతకు (జెన్-జీ) కీలక సూచన చేశారు. జీవితంలో అడ్డదారుల వెంట పడొద్దని, అవి అంతిమంగా తీవ్ర నష్టాలకే దారితీస్తాయని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



న్యూఢిల్లీ: బుధవారం ఢిల్లీలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రైల్వే స్టేషన్లలో తరచూ కనిపించే ఒక హెచ్చరికను ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. "షార్ట్‌కట్ విల్ కట్ యు షార్ట్" (అడ్డదారి మీ జీవితాన్ని కుదిస్తుంది) అనే బోర్డు కేవలం రైల్వే ట్రాక్‌లకే కాకుండా, నిజ జీవితానికి కూడా వర్తిస్తుందని పేర్కొన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు అందుబాటులో ఉన్నప్పటికీ, త్వరగా వెళ్లాలనే తొందరలో కొందరు ప్రమాదకరంగా పట్టాలు దాటుతుంటారని, అటువంటి అనాలోచిత నిర్ణయాలు తరువాయి 2 వ పేజీలో...



## మాజీ జడ్జి యశ్వంత్ వర్మ దోషి

### తేల్చిన ప్యానెల్.. వివరణపై అసంతృప్తి

### ఆధారాలను సరిగ్గా భద్రపరచలేదని దర్యాప్తుపై ఫైర్

ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మకు నగదు వ్యవహారంలో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆయన అధికారిక నివాసంలో భారీగా కాలిపోయిన నగదు లభించిన కేసులో వర్మ వివరణ సంతృప్తికరంగా లేదని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఏర్పాటు చేసిన కమిటీ తేల్చింది.

న్యూఢిల్లీ: ఈ మేరకు బుధవారం పార్లమెంటులో సమర్పించిన నివేదికలో ఆయన్ను దోషిగా పేర్కొంది. 2025 మార్చి 14న ఢిల్లీలోని తుగ్లక్ క్రెసెంట్‌లో ఉన్న వర్మ అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం జరిగింది. మంటలు ఆర్పేందుకు వెళ్లిన సిబ్బందికి తరువాయి 2 వ పేజీలో...



## మేజర్లు తల్లిదండ్రుల ఆస్తి కాదు

### ఇష్టమైన వ్యక్తితో జీవించేందుకు స్వేచ్ఛ ఉంది

### బాంబే హైకోర్టు సంచలన తీర్పు

ముంబై: వయసుకొచ్చిన పిల్లలు తల్లిదండ్రుల ఆస్తి కాదని, వారు తమ జీవితంపై నిర్ణయం తీసుకునేందుకు పూర్తి స్వేచ్ఛ ఉన్న స్వతంత్రులు అని బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తనకు నచ్చిన వ్యక్తితో జీవించేందుకు వెళ్లిన కుమార్తెను తమకు అప్పగించాలంటూ ఓ తల్లి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. మేజర్ అయిన యువతి తన జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కును కోర్టు సమర్థించింది. నాగ్‌పూర్‌కు చెందిన ఓ యువతి 17 ఏళ్ల వయసులో ట్యూషన్‌కు అని చెప్పి ఇంటి నుంచి వెళ్లి, ఓ యువకుడితో కలిసి వెళ్లిపోయింది. పోలీసులు తరువాయి 2 వ పేజీలో...

## చంద్రశేఖరన్ 'టాటా'

### 2027 తర్వాత కొనసాగబోనని ప్రకటన

### వచ్చే ఫిబ్రవరి 20తో ముగియనున్న పదవీకాలం

టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుత పదవీకాలం ముగిసిన తర్వాత మరోసారి ఛైర్మన్‌గా కొనసాగకూడదని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు బుధవారం టాటా సన్స్ బోర్డుకు తన నిర్ణయాన్ని తెలియజేశారు. ఆయన ప్రస్తుత పదవీకాలం 2027 ఫిబ్రవరి 20న ముగియనుంది. అంటే అప్పటివరకు ఛైర్మన్‌గా కొనసాగుతారు.



ముంబై: ఆగస్టు 18న జరగనున్న కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశానికి ముందు ఈ పరిణామం చోటుచేసుకుంది. చంద్రశేఖరన్ మరో ఐదేళ్ల పదవీకాలానికి కొనసాగింపుపై గతంలో ప్రతిపాదన వచ్చింది. సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్, సర్ రతన్ టాటా ట్రస్ట్‌లు ఏకగ్రీవంగా ఆయన పదవీకాలాన్ని పొడిగించాలని -2 వ పేజీలో...

## మాది టీ హబ్.. రేవంత్‌ది అనుముల హబ్



### సీఎం సోదరుడి సంస్థకు రూ.200 కోట్ల భూమి

### లక్ష మూలధనం ఉన్న కంపెనీకి భూ కేటాయింపులెలా?

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీత

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు అనుముల కొండల్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన విమర్శల దాడిని మరింత ఉధృతం చేశారు. సీఎం సోదరుడికి సంబంధముందని ఆరోపిస్తున్న టెస్సారక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు భూ కేటాయింపుల విషయంలో రూ. 200 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి 'అనుముల హబ్స్' ఏర్పాటులో బిజీగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు.

హైదరాబాద్, ఆగస్టు 12 (ఈవార్తలు): బుధవారం ఈ అంశంపై 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా కేటీఆర్ స్పందించారు. "తాము నిజమైన స్టార్టప్‌ల అభివృద్ధి కోసం టీ-హబ్ నిర్మిస్తే, రేవంత్ రెడ్డి మాత్రం కుటుంబ సభ్యులతో నడిచే, సున్నా ఆవిష్కరణలు, సున్నా ఉద్యోగులతో కూడిన స్కామ్.. అదేనండీ స్కీమ్ అయిన 'అనుముల హబ్స్' సృష్టిస్తున్నారు. అనుముల తరువాయి 2 వ పేజీలో...



## దవాఖానల్లో రూం చార్జీలకు పరిమితి!

### 3-స్టార్ హోటల్ అద్దె ప్రామాణికం

### పార్లమెంటరీ కమిటీ కీలక సిఫార్సు

న్యూఢిల్లీ: దేశంలోని మెట్రో నగరాల్లో ప్రైవేటు ఆసుపత్రులు వసూలు చేస్తున్న గది అద్దెలకు పరిమితి విధించాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫార్సు చేసింది. ఆయా ఆసుపత్రుల సమీపంలోని 3-స్టార్ హోటళ్ల సగటు అద్దె కంటే ఈ ఛార్జీలు అధికంగా ఉండకూడదని స్పష్టం చేసింది. పెరుగుతున్న వైద్య ఖర్చులను అదుపులోకి తీసుకువచ్చి, రోగులపై తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

13.8.2026

**మేషం:** అనుకున్న వ్యవహారాలు ముందుకు సాగవు. ప్రయాణాలలో జాగ్రత్త అవసరం. కొన్ని విషయాలలో బంధువులు, మిత్రులతో మాటపట్టింపులు కలుగుతాయి. ఆర్థిక సమస్యలు సతమతం చేస్తాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలలో అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి.

**వృషభం:** సమాజంలో పేరు కలిగిన వ్యక్తులతో పరిచయాలు విస్తృతమవుతాయి. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. చిన్ననాటి మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. సోదరుల నుంచి ధన సహాయం అందుతుంది. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఆశించిన మార్పులుంటాయి.

**మిథునం:** ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. విద్యార్థులకు నూతన అవకాశాలు లభిస్తాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. వాహన యోగం ఉన్నది. పనులలో అవాంతరాలు అధిగమిస్తారు. వ్యాపార, ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి.

**కర్కాటకం:** ముఖ్యమైన పనుల్లో జాప్యం కలుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహపరుస్తాయి. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి పెరుగుతుంది. దూరపు బంధువుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికమవుతుంది.

**సింహం:** ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ఇంటాబయటా సమస్యలు బాధిస్తాయి. ఆరోగ్య విషయంలో కొంత శ్రద్ధ వహించాలి. చేపట్టిన పనులు మధ్యలో విరమిస్తారు. వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఉద్యోగాలు అంతంతమాత్రంగా ఉంటాయి.

**కన్య:** చేపట్టిన పనులు చకచకా సాగుతాయి. ఆప్తుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. బంధువులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. కుటుంబ సభ్యులతో గృహమున ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారాలు ఆశించిన విధంగా రాణిస్తాయి. ఉద్యోగాలలో బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తారు.

**తుల:** చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. బంధువులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. నిరుద్యోగులు కష్టపడ్డా ఫలితం ఉండదు. కుటుంబ సభ్యుల ప్రవర్తన వలన మానసిక చికాకులు కలుగుతాయి. ముఖ్య వ్యవహారాలలో అవాంతరాలు తప్పవు. వ్యాపార,ఉద్యోగాలలో నూతన సమస్యలు ఎదురవుతాయి.

**వృశ్చికం:** గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థిక వ్యవహారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు చేసుకుంటారు. కొనుగోలు ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగాలలో మరింత ఉత్సాహంగా పని చేసి అధికారుల అనుగ్రహం పొందుతారు.

**ధనస్సు:** కీలక వ్యవహారాలు మందగిస్తాయి. ఇంటా బయట ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. సోదరులతో అకారణ కలహ సూచనలు ఉన్నవి. నూతన ఋణ యత్నాలు చేస్తారు. ఆరోగ్య విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి.

**మకరం:** అనుకున్న పనులు అనుకున్న రీతిలో సాగుతాయి. మిత్రుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. నూతన వ్యాపార ప్రారంభానికి చేసే ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ప్రభుత్వ అధికారులతో చర్చలు సఫలమవుతాయి. వృత్తి ఉద్యోగాలలో కీలక మార్పులు కలుగుతాయి.

**కుంభం:** నిరుద్యోగులకు నూతన ఉద్యోగాలు దక్కుతాయి. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభా పాటవాలు వెలుగులోకి వస్తాయి. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. వ్యాపారాలు లాభాల బాటలో సాగుతాయి. సంతానం విద్యా విషయాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఆర్థిక వ్యవహారాలు అనుకూలిస్తాయి.

**మీనం:** ముఖ్యమైన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయటం మంచిది. నూతన ఋణయత్నాలు సాగిస్తారు. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయుటం మంచిది కాదు. ఉద్యోగాలలో ఊహించని సమస్యలు చోటుచేసుకుంటాయి. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది.



# మన గోదావరి మనకే

**మొదటి పేజీ తరువాయి**

క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికలు అందజేయాలని రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులను ఆదేశించారు. బాధితులకు త్వరితగతిన పరిహారం చెల్లిస్తేనే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టులను నింపడానికి వీలవుతుందని ఆయన పేర్కొన్నారు. గట్టు, గుడెందొడ్డి ఎత్తిపోతల పథకాల సామర్థ్యం పెంపుపై తగిన అధ్యయనం చేయాలని, గుడెందొడ్డి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు కన్సల్టెంట్‌ను నియమించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### సీఎంఆర్ ఎగ్గొడితే తాట తీస్తా

ప్రభుత్వం నుంచి ధాన్యాన్ని తీసుకొని.. కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ఇవ్వకుండా, ధాన్యాన్ని పక్కదారి పట్టించిన మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారుకు స్పష్టం చేశారు. అక్రమాలకు పాల్పడిన మిల్లులను సీజ్ చేయాలని ఆదేశించారు. సీజ్ చేసిన మిల్లులను మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడిపించాలని అధికారులకు సీఎ: రేవంత్ రెడ్డి సూచించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో పౌరస రఫరా శాఖ అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ స్టీఫెన్ రవీంద్ర,సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి,ఇతర ఉన్నతాధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు. సీఎంఆర్ ఇవ్వడంలో డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్ల నుండి బకాయిలను వసూలు చేయాలని, బకాయిల వసూలుకు ఒక విధానాన్ని రూపొందించాలని, కేబినెట్ సబ్ కమిటీలో దీని పైన చర్చించి నిర్ణయం తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. బకాయిల వసూలే ప్రధాన లక్ష్యంగా చర్యలు ఉండాలి అని, మిల్లర్ల బ్లాక్ మెయిల్ ను సహించబోనని రేవంత్ హెచ్చరించారు. మార్కెట్ లో ఉన్న గోడౌన్ లను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, అవసరమైతే మిల్లింగ్ బాధ్యతల్ని మహిళా సంఘాలకు బాధ్యతలు అప్పగిస్తామని, 5 నియోజక వర్గాల్లో మహిళా సంఘాలకు 50 నుంచి 100ఎకరాల్లో గోడౌన్ ల నిర్మాణం కోసం పైలట్ ప్రాజెక్టు చేపట్టాలని సూచించారు. ధాన్యం ఎక్కువ దిగుబడి అయ్యే ప్రాంతాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయాలని రేవంత్ సూచించారు. గోడౌన్ ల నిర్మాణంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిధులను వినియోగించు కోవాలనా, ప్రతి జిల్లాకు నోడల్ అధికారిని నియమించాలని సీఎం సూచించారు.

## మేడిగడ్డ.. కేసీఆర్‌కు మళ్లీ నోటీసులు

**మొదటి పేజీ తరువాయి**

న్యాయస్థానం ముందు ఉంచాన్నారు. పిటిషన్‌లో పేర్లు ఉన్న ప్రతివాదులందరికీ నోటీసులు సమర్పించాల్సిన బాధ్యతను సంబంధిత యంత్రాంగానికి కోర్టు అప్పగించింది. కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో నాణ్యతా లోపాలు జరిగాయని, అలాగే నిధుల వినియోగంలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ గతంలో రాజలింగమూర్తి అనే వ్యక్తి భూపాలపల్లి జిల్లా కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన ఒక ప్రైవేట్ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించి, నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు సంబంధిత శాఖ అధికారులు, కాంట్రాక్టు సంస్థలకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను ప్రారంభించింది. అయితే ఈ కేసు విచారణ కొనసాగుతున్న సమయంలో పిటిషనర్ రాజలింగమూర్తి అనారోగ్యంతో మరణించారు. దీంతో పిటిషనర్ మృతి చెందడం వల్ల ఈ కేసు విచారణ ఆగిపోతుందా అనే సందేహాలు సర్వత్రా వ్యక్తమయ్యాయి. ఈ తరుణంలో ఈ అంశం తెలంగాణ హైకోర్టు దృష్టికి వెళ్లగా.. అత్యున్నత న్యాయస్థానం ఈ విషయంలో స్పష్టమైన తీర్పునిచ్చింది. ప్రజా ప్రయోజనాలు, ప్రాజెక్టు భద్రతతో ముడిపడి ఉన్న అంశం కాబట్టి పిటిషనర్ మరణించినప్పటికీ కేసు విచారణను నిలిపివేయవద్దని, యథావిధిగా భూపాలపల్లి జిల్లా కోర్టులోనే కేసు విచారణను కొనసాగించాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.

## చంద్రశేఖరన్ ‘టాటా’

**మొదటి పేజీ తరువాయి**

సిఫార్సు చేశాయి. టాటా సన్స్ నామినేషన్, రెమ్యునరేషన్ కమిటీ, బోర్డు కూడా ఈ ప్రతిపాదనను సిఫార్సు చేశాయి. అయితే 2026 ఫిబ్రవరి 24న జరిగిన బోర్డు సమావేశంలో ఓ సభ్యుడు ఈ ప్రతిపాదనకు మద్దతు ఇవ్వలేదు. ఏకాభిప్రాయం లేకపోవడంతో తాను నిర్ణయాన్ని వాయిదా వేసినట్లు చంద్రశేఖరన్ తెలిపారు. ఆ సమావేశానికి ఆరు నెలలు గడిచినా ఇప్పటివరకు దీనిపై నిర్ణయం రాలేదని చెప్పారు. టాటా సన్స్ చాలా పెద్ద సంస్థ అని చంద్రశేఖరన్ పేర్కొన్నారు. పలు కీలక వ్యూహాత్మక ప్రాజెక్టులు ప్రస్తుతం కీలక దశలో ఉన్నాయని తెలిపారు. 2027 ఫిబ్రవరి తర్వాత గ్రూప్‌ను నడిపించే నాయకుడు ఎవరన్న దానిపై ముందుగానే స్పష్టత ఉండటం అవసరమన్నారు. ఉద్యోగులు, పెట్టుబడిదారులు, భాగస్వాములు, ఇతర భాగస్వామ్య వర్గాలకు ఇది ముఖ్యమని చెప్పారు. అందుకే వారసుడి ఎంపికను త్వరగా పూర్తి చేయాలని బోర్డును కోరినట్లు వెల్లడించారు. తన రాజీనామా ప్రకటనలో చంద్రశేఖరన్ టాటా గ్రూప్‌లో తన 40 ఏళ్ల ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ సంస్థకు సేవ చేసే అవకాశం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. గత పదేళ్లుగా టాటా సన్స్‌ను నడిపించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. తనకు సహకరించిన భాగస్వామ్య వర్గాలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## మాజీ జడ్జి యశ్వంత్ వర్మ దోషి

**మొదటి పేజీ తరువాయి**

ఓ స్టోర్‌రూమ్‌లో భారీగా కాలిపోయిన రూ.500 నోట్ల కట్టలు కనిపించాయి. నగదు అక్కడికి ఎలా వచ్చింది? దాని మూలం ఏంటి? ఎవరిది? అనే అంశాలపై వర్మ ఇచ్చిన వివరణను కమిటీ తిరస్కరించింది. వర్మ ఇచ్చిన సమాధానాల్లో పారదర్శకత లేదని కమిటీ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారంపై 2025 మార్చి 22న ఆయన ఇచ్చిన వివరణ కూడా సంతృప్తికరంగా లేదని నివేదికలో పేర్కొంది. అయితే కీలక విషయమొకటి కూడా కమిటీ స్పష్టం చేసింది. నగదును వర్మ స్వయంగా అక్కడి నుంచి తొలగించారనడానికి ఆధారాలు లభించలేదని తెలిపింది. నగదు లభించిన తర్వాత దర్యాప్తులో ఆధారాలను సరిగ్గా భద్రపరచలేదని కమిటీ తప్పుబట్టింది. స్టోర్‌రూమ్‌ను చట్టబద్ధంగా సీల్ చేసి తనిఖీ చేయకముందే అక్కడి సిబ్బంది కదలికలతో కీలక ఆధారాలు దెబ్బతిన్నాయని పేర్కొంది. అనంతరం నగదు కనిపించకుండా పోవడం లేదా అందుబాటులో లేకపోవడానికి కారణం కూడా స్పష్టంగా తెలియలేదని తెలిపింది. అప్పటి సీజేఐ సంజీవ్ ఖన్నా ఏర్పాటు చేసిన అంతర్గత కమిటీ కూడా వర్మకు ఆ స్టోర్‌రూమ్‌పై ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా నియంత్రణ ఉందని తేల్చింది. వివాదం తర్వాత వర్మను అలహాబాద్ హైకోర్టుకు తిరిగి పంపారు. అనంతరం ఆయన రాజీనామా చేశారు.

## మేజర్లు తల్లిదండ్రుల ఆస్తి కాదు

**మొదటి పేజీ తరువాయి**

ఆమెను గుర్తించి తల్లికి అప్పగించారు. అయితే, కొన్నాళ్ల తర్వాత ఆమె మళ్లీ ఇంటి నుంచి వెళ్లిపోవడంతో తన కుమార్తెను ఆ యువకుడు అక్రమంగా నిర్బంధించాడంటూ తల్లి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసింది. విచారణ సందర్భంగా కోర్టు నేరుగా ఆ యువతితో మాట్లాడింది. తాను ఇష్టప్రకారమే ఆ యువకుడితో కలిసి ఉంటున్నానని, అతనితోనే జీవించాలనుకుంటున్నానని ఆమె స్పష్టం చేసింది. ప్రస్తుతం ఆమె మేజర్ అని నిర్ధారించుకున్న న్యాయస్థానం, ఆమె నిర్ణయాన్ని గౌరవించాలని తెలిపింది. అక్రమ నిర్బంధం రుజువు కాని పక్షంలో హెబియస్ కార్పస్ పిటిషన్ చెల్లదని స్పష్టం చేస్తూ తల్లి పిటిషన్‌ను నాగ్‌పూర్ ధర్మాసనం కొట్టివేసింది.

## ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ చెల్లదు

**మొదటి పేజీ తరువాయి**

జారీ చేసిన విషయం తెలిసిందే. కుటుంబ యజమాని, సభ్యుల పేర్లు, వయసు, చిరునామా, ఆధార్ వివరాలతో కూడిన ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్‌ను ఓటర్ల జాబితా సవరణలో ఉపయోగించుకోవచ్చని తొలుత ప్రచారం జరిగింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6 లక్షల మంది ఈ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కులు ఇవ్వొద్దు

ఆమోదింపచేయలేదని తెలిపారు. కేవలం జీవో ద్వారానే ఈ పథకాన్ని కొనసాగిస్తున్నారని ఇది చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏదైనా పథకం కొనసాగించాలంటే చట్టసభల్లో తీర్మానం చేసిన తర్వాత అమలు చేయాల్సి ఉంటుందని విజయ గోపాల్ వాదించారు. ఈ పిటిషన్‌పై గత నెల 9న విచారణ జరిగిన సందర్భంగా కౌంటర్ దాకలు చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అయినా, ప్రభుత్వం ఇప్పటి వరకు కౌంటర్ దాఖలు చేయలేదని న్యాయవాది విజయ్ గోపాల్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సంక్షేమ కార్యక్రమమని, దీని కింద నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతులు లబ్ధి పొందుతున్నారని అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ కోర్టుకు తెలిపారు. వివిధ శాఖల నుంచి సమాచారం రావాల్సి ఉన్నందున కౌంటర్ దాఖలు చేయడంలో ఆలస్యమైందని కోర్టుకు తెలిపారు. కౌంటర్ దాఖలు చేయడానికి ఏఏజీ 4 వారాల గడువు కోరారు. 4 వారాల గడువు ఇచ్చిన హైకోర్టు అప్పటివరకు కల్యాణలక్ష్మి షాదీ, ముబారక్ పథకాలపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ వరకు ఈ పథకం కింద ఎలాంటి చెక్కులు మంజూరు చేయొద్దని స్పష్టం చేసింది.

## రేవంత్‌ది అనుముల హబ్

**మొదటి పేజీ తరువాయి**

సోదరుల్లో ఒకరైతే చాలు, ఎలాంటి ప్రశ్నలు లేకుండా చౌక ధరకే ప్రభుత్వ భూమిని కేటాయిస్తారు. సున్నా పెట్టుబడితో రాత్రికి రాత్రే రూ. 200 కోట్లు సంపాదించినందుకు అనుముల కొండల్ రెడ్డిని ‘శతాబ్దపు ఆవిష్కర్త’గా ప్రకటించాలి” అని కేటీఆర్ తన పోస్టులో పేర్కొన్నారు. కేవలం రూ. లక్ష చెల్లింపు మూలధనం, సున్నా ఉద్యోగులు ఉన్న కంపెనీకి అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ఎలా కేటాయిస్తారని ఆయన ప్రశ్నించారు. సుమారు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకే, అంటే గజం రూ. 3,700 చొప్పున కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ భూముల నుంచి కోట్లాది రూపాయలు సంపాదించే ఈ మ్యాజిక్ ట్రిక్‌ను కేవలం అనుముల కుటుంబానికే పరిమితం చేయకుండా తెలంగాణ యువతకు కూడా నేర్పించాలని మంత్రి శ్రీధర్ బాబు, సీఎం రేవంత్ రెడ్డిలను ఉద్దేశించి అన్నారు. టెస్సారక్ట్ సంస్థతో సీఎం సోదరుడికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు చేసిన ప్రకటనను కేటీఆర్ తప్పుబట్టారు. కొండల్ రెడ్డి లింక్డ్‌ఇన్ ప్రొఫైల్‌లో, యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్‌లో ఆయన్ను టెస్సారక్ట్ ఛైర్మన్‌గా గుర్తించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ భూ కేటాయింపులకు సంబంధించిన జీవో, భూమి విలువ, అర్హత ప్రమాణాలు, పెట్టుబడి ప్రతిపాదనలు వంటి అన్ని పత్రాలను ప్రభుత్వం వెంటనే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ భూ కేటాయింపుల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని, దీనిపై ముందుగా గవర్నర్‌కు ఫిర్యాదు చేసి, అవసరమైతే లోకాయుక్తను, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. వాస్తవాలు వెలుగులోకి వచ్చి, బాధ్యులను శిక్షించే వరకు ఈ అంశాన్ని వదిలిపెట్టబోమని తేల్చి చెప్పారు.

## ..చార్జీలకు పరిమితి!

**మొదటి పేజీ తరువాయి**

పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా కమిటీ ఈ కీలక సూచనలు చేసింది. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖకు సంబంధించిన పార్లమెంటరీ స్థాయీ సంఘం తన 176వ నివేదికలో ఈ సిఫార్సులను పొందుపరిచింది. ‘ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల అందుబాటు-స్తోమత’ పేరిట రూపొందించిన ఈ నివేదికను ఆగస్టు 7న పార్లమెంటు ఉభయ సభల్లో ప్రవేశపెట్టారు. ఆసుపత్రుల్లోని మౌలిక సదుపాయాలు, సేవలను బట్టి గది అద్దెల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నాయని, తక్షణమే వీటిని హేతుబద్ధీకరించాలని కమిటీ సూచించింది. ఈ నిబంధన కేవలం ప్రాథమిక గది అద్దెకే వర్తిస్తుందని, రెసిడెంట్ డాక్టర్, నర్సింగ్, భోజనం ఖర్చులను ఆసుపత్రులు అదనంగా వసూలు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. జాతీయ నమూనా సర్వే (2025) గణాంకాలను కమిటీ ఈ సందర్భంగా ఉటంకించింది. ప్రభుత్వ ఆసుపత్రిలో సగటు చికిత్స వ్యయం రూ. 6,631గా ఉండగా, ప్రైవేటు ఆసుపత్రుల్లో అది రూ. 50,508గా ఉందని పేర్కొంది. ఉదాహరణకు, ముంబైలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో సింగిల్ రూమ్ అద్దె రోజుకు రూ. 6,000 నుంచి రూ. 12,000 వరకు ఉండగా, సమీపంలోని 3-స్టార్ హోటళ్లలో అది రూ. 2,500 నుంచి రూ. 4,500 మధ్యే ఉందని నివేదికలో వివరించింది. గది అద్దెలతో పాటు ప్రైవేటు ఆసుపత్రులలోని కీలక చికిత్సలు, వ్యాధి నిర్ధారణ పరీక్షల ధరలను కూడా నియంత్రించేలా ఒక చట్టబద్ధమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కమిటీ సిఫార్సు చేసింది. చికిత్స ప్రారంభించడానికి ముందే అంచనా వ్యయాన్ని రోగులకు వివరించాలని సూచించింది. అయితే, హోటళ్లతో ఆసుపత్రులను పోల్చడం సరికాదని, ఆసుపత్రుల్లోని వైద్య సేవలు, సిబ్బంది, మౌలిక సదుపాయాలు హోటళ్లతో పోలిస్తే భిన్నంగా ఉంటాయని కొన్ని ఆసుపత్రుల యాజమాన్యాలు అభిప్రాయపడ్డాయి.

## జీవితంలో షార్ట్ కట్‌లు వద్దు

**మొదటి పేజీ తరువాయి**

ప్రాణాంతకమని హెచ్చరించారు. యువత తప్పుడు మార్గాలను వీడి, అర్థవంతమైన జీవన గమనాన్ని ఎంచుకోవాలని సూచించారు. “మీరు ఆరాధించే మహనీయుల జీవిత చరిత్రలను తప్పనిసరిగా చదవండి. వాటి ద్వారా స్ఫూర్తి పొంది సరైన మార్గాన్ని కనుగొనవచ్చు” అని ఆయన యువతకు సలహా ఇచ్చారు. ముఖ్యంగా ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసే ఇన్‌ఫ్లుయెన్సర్ల కంటెంట్ పట్ల నిరంతరం జాగ్రత్తగా ఉండాలని ఆయన హితవు పలికారు.

# హైడ్రా మరో ధిక్కరణ



**హైకోర్టు సీరియస్**

హైదరాబాద్, ఆగస్టు 12 (ఈవార్తలు): దిశ, తెలంగాణ బ్యూరో: రెవెన్యూ అధికారుల ఆదేశాలు లేకుండానే ఇష్టారాజ్యంగా కూల్చివేతలకు పాల్పడుతున్న హైడ్రా తీరుపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. న్యాయస్థానం గతంలో ఇచ్చిన స్టే ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ, కనీస సమాచారం లేకుండా ప్రహరీ గోడలు కూల్చివేయడాన్ని తీవ్రంగా పరిగణించిన జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం.. హైడ్రాపై సుమోటోగా కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. మల్కాజిగిరి మండల పరిధిలోని వాణి కో ఆపరేటివ్ సొసైటీలో తమ స్థలాల జోలికి రావొద్దని గతంలో కోర్టు ఉత్తర్వులు ఉన్నా, హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన రిట్ పిటిషన్‌ను బుధవారం న్యాయస్థానం విచారించింది. ఈ సందర్భంగా కోర్టుకు హాజరైన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, మల్కాజిగిరి తిరుమలగిరి తహసీల్దార్లు సంచలన విషయాలను వెల్లడించారు. పిటిషనర్ల ఆస్తులను కూల్చాలని గానీ, అక్కడ ఫెన్సింగ్ వేయాలని గానీ తాము హైడ్రాకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని వారు ధర్మాసనానికి స్పష్టం చేశారు. కేవలం రక్షణ శాఖ భూములను కాపాడాలని తాము కోరిన మాట వాస్తవమే అయినా, పిటిషనర్ల ప్రహరీ గోడల కూల్చివేతతో తమకు సంబంధం లేదని చెప్పారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి.. రెవెన్యూ అధికారుల నుంచి కనీస అనుమతులు లేకుండా, రికార్డులను పరిశీలించకుండా హైడ్రా సొంత నిర్ణయాలతో ఎలా కూల్చివేతలు చేపడుతుందని నిలదీశారు. 2022 నుంచి ఈ భూములు హైకోర్టు స్టే ఉత్తర్వులు అమల్లో ఉన్నాయని, వాటిని ఉల్లంఘించడం ధిక్కరణ కిందకే వస్తుందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఇదే క్రమంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్.. కోర్టు దృష్టికి మరో ముఖ్యమైన విషయాన్ని తెచ్చారు. తన పరిధిలో ఇప్పటివరకు దాదాపు 30 నుంచి 40 కూల్చివేతలను హైడ్రా చేపట్టిందని, అయితే ఆయా పనులకు సంబంధించి రెవెన్యూ శాఖ నుంచి ఎలాంటి విజ్ఞప్తులు వెళ్లలేదని, అసలు తమకు సమాచారమే లేదని కలెక్టర్ వెల్లడించారు. అధికారుల మధ్య కనీస సమన్వయం లేకుండా, చట్టబద్ధత లేని ఇటువంటి కూల్చివేతలు ఏ ప్రాతిపదికన చేపడుతున్నారో వివరించాలని హైడ్రాను కోర్టు కోరింది. అనధికారికంగా చేపట్టిన ఆ 30-40 కూల్చివేతలపై పూర్తి నివేదికను తదుపరి విచారణ నాటికి సమర్పించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. అంతేకాకుండా, హైడ్రా ఏర్పాటుకు ముందు భూవివాదాలకు సంబంధించి హైకోర్టు వివిధ సందర్భాల్లో ఇచ్చిన స్టే ఉత్తర్వుల వివరాలేవీ హైడ్రాకు చేరడం లేదని న్యాయస్థానం గుర్తించింది. దీంతో భవిష్యత్తులో కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన జరగకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కీలక ఆదేశాలు జారీ చేసింది. హైడ్రా కార్యకలాపాలు సాగే అన్ని జిల్లాల కలెక్టర్లకు తగిన ఆదేశాలు జారీ చేయాలని, కోర్టులో పెండింగ్‌లో ఉన్న స్టే ఉత్తర్వుల వివరాలను తక్షణమే హైడ్రాకు తెలియజేయాలని సూచించింది. తద్వారా చట్టవిరుద్ధమైన కూల్చివేతలకు అడ్డుకట్ట వేయాలని స్పష్టం చేసింది. హైడ్రాపై నమోదు చేసిన కోర్టు ధిక్కరణ కేసులో రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. ఈ విచారణకు రెవెన్యూ అధికారులు మళ్లీ హాజరు కావాల్సిన అవసరం లేదని ధర్మాసనం మినహాయింపు ఇచ్చింది.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.




## కాళేశ్వరమే కరువును పారదోలే కల్పవల్లి

**కన్నపల్లి పంపులు ఆన్ చేస్తే నీరందించొచ్చు**

**లక్ష క్యూసెక్కుల నీరు వృథా: విద్యాసాగర్‌రావు**

**కరువు రాకూడదనే కాళేశ్వరం నిర్మించారు: దావ వసంత**

జగిత్యాల, ఆగస్టు 12 (ఈవార్తలు): రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని వినియోగించాలని బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. జగిత్యాలలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌తో కలిసి బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ కన్నపల్లి పంపులు ఆన్ చేస్తే రైతులకు నీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రస్తుతం సుమారు లక్ష క్యూసెక్కుల నీరు వృథాగా పోతోందని పేర్కొన్నారు. మిడ్‌మానేరు ప్రాజెక్టును నింపి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో పాటు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సమస్యను పరిష్కరించారని తెలిపారు. జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిందని విద్యాసాగర్‌రావు తెలిపారు. జగిత్యాల నియోజకవర్గంలో 87.6 శాతం, కోరుట్లలో 89.26 శాతం, ధర్మపురిలో 91.97 శాతం మ్యాపింగ్ పూర్తయిందన్నారు. డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వచ్చిన అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దావ వసంత మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం ఉంటుందని శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం సమీక్ష నిర్వహించలేదని విమర్శించారు. కరువు రాకుండా ఉండేందుకే కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని అన్నారు. రాజకీయాలు ఎన్నికల సమయంలోనే చేయాలని, రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఆయిల్నేని వెంకటేశ్వర్‌రావు, తుమ్మ గంగాధర్, ఆనంద్‌రావు, శీలం ప్రవీణ్, గాజుల రాజేందర్, పడిగెల గంగారెడ్డి, అనురాధ, లక్ష్మణ్‌రావు, సన్నిహిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రగడ్డ టిమ్స్‌కు మాగంటి గోపీనాథ్ పేరు పెట్టాలి

**ప్రభుత్వం ఇచ్చిన జీవోను పునరుద్ధరించాలి**

**బీఆర్ఎస్ నేత నవీన్ పటేల్ డిమాండ్**



జూబ్లీహిల్స్, ఆగస్టు 12 (ఈవార్తలు): ఎర్రగడ్డలో నిర్మిస్తున్న తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆసుపత్రికి దివంగత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పేరు పెట్టాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నవీన్ పటేల్ ప్రభుత్వాన్ని కోరారు. మాగంటి గోపీనాథ్ సేవలకు నిజమైన నివాళిగా ఈ నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ ప్రజలకు, ముఖ్యంగా పేద, బడుగు వర్గాలకు ప్రపంచస్థాయి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో ఐదు టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని నవీన్ పటేల్ తెలిపారు. అందులో భాగంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఎర్రగడ్డ ఛాతీ ఆసుపత్రి ప్రాంగణంలో 22 ఎకరాల విస్తీర్ణంలో 1,000 పడకల ఆసుపత్రి నిర్మాణం ప్రారంభమైందన్నారు. ఎర్రగడ్డలో టిమ్స్ ఏర్పాటు కోసం అప్పటి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ప్రత్యేకంగా కృషి చేశారని, అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సహకారం అందించారని పేర్కొన్నారు. ఆసుపత్రి నిర్మాణానికి స్థలం ఎంపిక నుంచి డిజైన్, నిర్మాణ ప్రక్రియ వరకు మాగంటి గోపీనాథ్ ఎంతో శ్రద్ధ చూపారని తెలిపారు. పేదలు, బడుగు బలహీన వర్గాలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో మాగంటి గోపీనాథ్ పనిచేశారని నవీన్ పటేల్ అన్నారు. టిమ్స్ ఆసుపత్రి పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్న సమయంలో ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషి, సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. దేశంలోనే అత్యుత్తమ ప్రభుత్వ వైద్య నిర్మాణాల్లో ఒకటిగా టిమ్స్‌ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో అప్పట్లో ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగి ఉంటే ఆసుపత్రి రెండేళ్ల క్రితమే పూర్తయ్యేదని నవీన్ పటేల్ అన్నారు. దివంగత మర్రి చెన్నారెడ్డి సేవల పట్ల తమకు పూర్తి గౌరవం ఉందని, ఆయన పేరుతో ఇప్పటికే పలు ప్రభుత్వ భవనాలు, సంస్థలు ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎర్రగడ్డ టిమ్స్‌కు మాగంటి గోపీనాథ్ పేరు పెట్టేందుకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన జీవోను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్‌పై సానుకూలంగా స్పందించకపోతే బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో పాటు మాగంటి గోపీనాథ్ అభిమానులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని నవీన్ పటేల్ హెచ్చరించారు.

## నిరుపేద మృతదేహానికి ఎమ్మెల్యే ఆపన్నహస్తం

**అంత్యక్రియలకు రూ.5 వేల సాయం**

రాయికల్, ఆగస్టు 12 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా రాయికల్ మండలం మహితాపూర్‌కు చెందిన నిరుపేద దుమల రవి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ చొరవ చూపారు. గ్రామ సర్పంచ్ తలారి నాగమణి రాజేష్ విజ్ఞప్తి మేరకు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లిన ఎమ్మెల్యే.. అంత్యక్రియల కోసం రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. గ్రామ పంచాయతీ, కుల సంఘం ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడాన్ని అభినందించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ వార్డును ఎమ్మెల్యే పరిశీలించారు. పలు అనారోగ్య సమస్యలకు వైద్యులు అందుబాటులో ఉన్నారని, ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## నాణేనికి మరో వైపు చూపిస్తా

**ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా గొంతు నొక్కుతున్నారు.. కూటమి సర్కారుపై జగన్ మండిపాటు**



తాడేపల్లి, ఆగస్టు 12 (ఈవార్తలు): ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా తమ గొంతు నొక్కేందుకే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరోపించారు. శాసనసభను దాదాపు రెండేళ్లుగా బహిష్కరిస్తున్నప్పటికీ, శాసనమండలి వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఆయన పార్టీ ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ఆగస్టు 17 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో బుధవారం నాడు ఆయన పార్టీ శాసనసభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన పార్టీ అయిన వైసీపీకి ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేందుకు ప్రభుత్వం ఇష్టపడటం లేదని, అందుకే ప్రజా సమస్యలను మీడియా ద్వారానే ప్రజల దృష్టికి తీసుకెళ్లి నాణేనికి మరోవైపు చూపిస్తానని స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీకి ఉన్న బలాన్ని ఉపయోగించుకుని ప్రజావాణిని బలంగా వినిపించాలని జగన్ సూచించారు. "గత 74 రోజులుగా డీఎస్సీ కుంభకోణంపై 10 రకాల నిరసనలు చేపట్టాం. పేపర్ లీకేజీ, ఔట్‌సోర్సింగ్ కుంభకోణాలు, స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు, ప్రభుత్వ ఉత్తర్వుల మార్పు వంటి అంశాలను ఆధారాలతో సహా బయటపెట్టాం. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రమేయంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశాం" అని జగన్ వివరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాలకు సంబంధించి 13 త్రైమాసికాల బకాయిలు పేరుకుపోయాయని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జగన్ అన్నారు. సుమారు రూ. 9,100 కోట్లు, రూ. 3,300 కోట్ల బకాయిలు ఉండగా, ప్రభుత్వం కేవలం రూ. 2,900 కోట్లు విడుదల చేసిందని విమర్శించారు. ఈ అంశాన్ని మండలిలో లేవనెత్తి చర్చకు పట్టుబట్టాలని ఎమ్మెల్సీలకు సూచించారు. రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని, పంటలకు నీరందడం లేదని, ఉచిత పంటల బీమా నిలిపివేయడంతో అన్నదాతలు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. పీపీపీ ప్రాజెక్టుల పేరుతో ప్రైవేటు సంస్థలకు రాయితీలు కల్పిస్తూ ప్రజలపై భారం మోపుతున్నారని, ప్రభుత్వ సేవల ప్రైవేటీకరణను గట్టిగా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.

## ఫ్రీగా నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్



హైదరాబాద్, ఆగస్టు 12 (ఈవార్తలు): వైద్య విద్యలో ప్రవేశం పొందాలనే లక్ష్యంతో నీట్-2027కు సిద్ధమవుతున్న తెలంగాణ విద్యార్థులకు మంచి అవకాశం అందుబాటులోకి వచ్చింది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) వచ్చే ఏడాది నిర్వహించనున్న నీట్ యూజీ పరీక్ష కోసం ఉచిత లాంగ్‌టర్మ్ కోచింగ్ అందించనుంది. అర్హత ఉన్న విద్యార్థులు ఆగస్ట్ 22వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ సంస్థ కార్యదర్శి కంభంపాటి శారద తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఈ ప్రత్యేక కోచింగ్ కార్యక్రమంలో మొత్తం 200 మంది విద్యార్థులకు అవకాశం కల్పించనున్నారు. ఇందులో 100 మంది అబ్బాయిలు, మరో 100 మంది అమ్మాయిలకు సీట్లు కేటాయించారు. హైదరాబాద్‌లోని చిలుకూరు టీజీఎస్‌డబ్ల్యూఆర్ ఫౌండేషన్ సీవోఈలో అబ్బాయిలకు.. మహేంద్రహిల్స్ ఫౌండేషన్ సీవోఈలో అమ్మాయిలకు ఉచిత నీట్ శిక్షణ అందించనున్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఏదైనా కాలేజీలో ఇంటర్మీడియట్ బైపీసీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ఈ ఫ్రీ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే నీట్-2026 పరీక్షకు హాజరైన అభ్యర్థులకు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ అధికారిక వెబ్‌సైట్ నుంచి నోటిఫికేషన్, దరఖాస్తు ఫారం డౌన్‌లోడ్ చేసుకుని.. దాన్ని పూర్తిగా నింపిన తర్వాత అవసరమైన ధ్రువపత్రాలను జత చేసి.. సంబంధిత జిల్లా డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ (డీసీఓ) ద్వారా నిర్దేశించిన కేంద్రాల్లో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అబ్బాయిలకు సంబంధించిన దరఖాస్తులను చిలుకూరు కేంద్రంలో.. అమ్మాయిల దరఖాస్తులను మహేంద్రహిల్స్ కేంద్రంలో సమర్పించాలని అధికారులు సూచించారు. ఈ నీట్ ఫ్రీ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థుల నుంచి ఎలాంటి అప్లికేషన్ ఫీజు వసూలు చేయడం లేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. అంతేకాకుండా ఇందులో ఎంపికైన 200 మంది అభ్యర్థులకు ఉచిత వసతితోపాటు.. నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన కోచింగ్ అందించనున్నట్లు వెల్లడించారు. వైద్య విద్యలో సీటు సాధించాలనుకునే అర్హులైన విద్యార్థులకు ఈ అవకాశం ఎంతో ఉపయోగపడనుందని చెప్పారు. ఈ ఫ్రీ నీట్ కోచింగ్ దరఖాస్తులకు చివరి తేదీ ఈనెల 22 అని.. గడువు ముగిసేలోపు విద్యార్థులు దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## సగం డిగ్రీ కాలేజీలకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాళ్లే!

**75 డిగ్రీ కాలేజీల్లో లేని రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు.. ఒక్కో ప్రిన్సిపాల్‌కు రెండు, మూడు కాలేజీల బాధ్యతలు**




హైదరాబాద్, ఆగస్టు 12 (ఈవార్తలు): రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో దాదాపు సగం వరకు రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు లేకుండానే కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 159 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 75 చోట్ల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాళ్లే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని 'క్వాలిఫైడ్ గవర్నమెంట్ డిగ్రీ లెక్చరర్స్ అసోసియేషన్' వెల్లడించింది. ప్రిన్సిపాల్ పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల దైనందిన పరిపాలనతో పాటు ప్రవేశాలు, విద్యాపరమైన పర్యవేక్షణపై తీవ్ర ప్రభావం పడుతోందని అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఒక్కో ప్రిన్సిపాల్ రెండు, మూడు కళాశాలల అదనపు బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోందని, దీనివల్ల ఏ ఒక్క కళాశాలపై కూడా పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రవేశాలు, పరీక్షల సమయంలో ధ్రువపత్రాలు, ఉపకారవేతనాలు, హాజరు వంటి అంశాల్లో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అధ్యాపకుల నియామకాలు, పదోన్నతుల్లో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలే ఈ ఖాళీలకు ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం 151 మంది అర్హులైన అధ్యాపకులు పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్నారు. వివిధ బ్యాచ్‌ల సీనియారిటీ జాబితాలపై నెలకొన్న వివాదమే ఈ ప్రక్రియకు అడ్డంకిగా మారింది. 1998 బ్యాచ్‌కు చెందిన జూనియర్ అధ్యాపకులను, తర్వాత కాలంలో వచ్చిన 2001, 2002, 2004, 2005 బ్యాచ్‌ల కంటే సీనియర్లుగా గుర్తించాలని అసోసియేషన్ డిమాండ్ చేస్తోంది. ఈ అంశంపై అసోసియేషన్ అధ్యక్షుడు, ఇంగ్లీష్ అసోసియేట్ ప్రొఫెసర్ టీ.ఎస్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, నిబంధనల ప్రకారం అత్యంత పారదర్శకంగా ఈ 75 ప్రిన్సిపాల్ పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా కళాశాలల పరిపాలన మెరుగుపడటంతో పాటు, పదవీ విరమణకు చేరువలో ఉన్న సీనియర్ అధ్యాపకులకు సముచిత గౌరవం, అవకాశం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## మల్యాలలో ఘనంగా యువ సమ్మేళనం

మల్యాల, ఆగస్టు 12 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో యువ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. యువతలో ఐక్యత, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు సమాజ అభివృద్ధిలో యువత పాత్రపై ఈ సందర్భంగా చర్చించారు. కార్యక్రమానికి యువత పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. విద్య, ఉపాధి, క్రీడలు, సామాజిక సేవతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో యువత చురుకైన పాత్ర పోషించాలని నిర్వాహకులు సూచించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. యువతే దేశ భవిష్యత్తని, సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంలో యువత ముందుండాలని అన్నారు. యువత తమ ప్రతిభను సద్వినియోగం చేసుకుంటూ సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిర్వాహకులు, యువజన నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

## స్కానింగ్ కేంద్రాలు నిబంధనలు పాటించాలి

**ఉల్లంఘిస్తే హెచ్చరిక నోటీసులు**

**ఫారం-ఎఫ్‌ను 5లోగా సమర్పించాలి.. జగిత్యాల డీఎంహెచ్‌వో సుజాత**

జగిత్యాల, ఆగస్టు 12 (ఈవార్తలు): స్కానింగ్ కేంద్రాలు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.సుజాత సూచించారు. బుధవారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో డీఎంహెచ్‌వో అధ్యక్షతన జిల్లా అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ కేంద్రాలకు హెచ్చరిక నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. ప్రతి నెల ఫారం-ఎఫ్ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి, 5వ తేదీలోగా సంబంధిత పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కార్యాలయాల్లో సమర్పించాలని సూచించారు. మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 84 స్కానింగ్ కేంద్రాలకు అనుమతి ఉందని తెలిపారు. రిజిస్ట్రేషన్, నిర్వహణకు సంబంధించిన నిబంధనలను కమిటీ సభ్యులతో చర్చించారు. సమావేశంలో సీనియర్ గైనకాలజిస్ట్ అరుణ, డాక్టర్ విశ్వభారతి, దీపక్‌రెడ్డి, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చీటి రామకృష్ణారావు, తౌటు రామచంద్రం, అనుగంటి రాజేశం, రవీందర్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవానికి భద్రత కట్టుదిట్టం

జగిత్యాల, ఆగస్టు 12 (ఈవార్తలు): ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో బాంబ్ డిస్పోజల్ టీమ్, శిక్షణ పొందిన పోలీసు జాగిలాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, బ్యాగులు, పార్సిళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు తమ పరిసరాల్లో గుర్తుతెలియని వ్యక్తులు, అనుమానాస్పద వాహనాలు, బ్యాగులు లేదా ఇతర వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. అనుమానాస్పద వస్తువులను స్వయంగా పరిశీలించకుండా వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. ప్రజల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తనిఖీల్లో బాంబ్ డిస్పోజల్ టీమ్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.



## మైనారిటీ మహిళలకు సబ్సిడీ చెక్కులు

**39 మందికి రూ.19.50 లక్షల ఆర్థిక సాయం**

**స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**

ధర్మపురి, ఆగస్టు 12 (ఈవార్తలు): మైనారిటీ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం కింద ధర్మపురి పట్టణ, మండల పరిధిలో ఎంపికైన 39 మంది మహిళలకు రూ.19.50 లక్షల విలువైన 100 శాతం సబ్సిడీ చెక్కులను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బుధవారం పంపిణీ చేశారు. ధర్మపురిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. పథకం కింద ఒక్కో మహిళకు రూ.50 వేల చొప్పున 100 శాతం సబ్సిడీగా ఆర్థిక సాయం అందించారు. మొత్తం 39 మంది లబ్ధిదారులకు రూ.19.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ పథకం ద్వారా వితంతువులు, విడాకులు పొందిన మహిళలు, అనాథలు, నిరుపేదలు, ఒంటరి మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తుందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి అవకాశాలను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగాలని లబ్ధిదారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో.. మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కొండగట్టు హుండీలో డమ్మీ నోట్ల కట్టలు

**రూ.2.50 లక్షల విలువైనవిగా సమాచారం**

**అసలు నోట్లతో కలిపి గుర్తించిన ఆలయ సిబ్బంది**

మల్యాల, ఆగస్టు 12 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన హుండీ లెక్కింపులో డమ్మీ నోట్ల కట్టలు వెలుగుచూశాయి. హుండీలో భక్తులు సమర్పించిన నగదును లెక్కిస్తుండగా ఐదు బండిళ్ల డమ్మీ నోట్లు గుర్తించినట్లు సమాచారం. సుమారు రూ.2.50 లక్షల విలువైన డమ్మీ నోట్లు ఉన్నట్లు తెలుస్తోంది. అసలు కరెన్సీ నోట్లతో కలిసివున్న వీటిని ఆలయ సిబ్బంది లెక్కింపు సమయంలో గుర్తించారు. భక్తులు విరాళాలుగా సమర్పించే హుండీలోకి డమ్మీ నోట్ల కట్టలు ఎలా వచ్చాయన్న అంశంపై ప్రస్తుతం ఆసక్తికర చర్చ జరుగుతోంది. కావాలనే ఎవరైనా డమ్మీ నోట్లను హుండీలో వేసారా? లేక మరేదైనా కారణమా? అనే కోణంలో ఆలయ అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. డమ్మీ నోట్ల వ్యవహారంపై పూర్తి వివరాలను తెలుసుకునేందుకు ఆలయ అధికారులు పరిశీలన చేపట్టారు. హుండీ లెక్కింపు పూర్తయిన అనంతరం ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## తైక్వాండోలో ప్రసన్న ఆంజనేయులు ప్రతిభ



హైదరాబాద్, ఆగస్టు 12 (ఈవార్తలు): తైక్వాండో రంగంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించేందుకు హైదరాబాద్‌లో నిర్వహించిన భారీ ప్రదర్శనలో పద్మకాలనీ, నల్లకుంటకు చెందిన ఓ మా తైక్వాండో అకాడమీ బ్లాక్‌బెల్ట్ నాలుగో డాన్ ప్రసన్న ఆంజనేయులు పాల్గొని ప్రతిభ చాటారు. తైక్వాండో క్రీడా రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు 30 సార్లు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించిన గ్రాండ్ మాస్టర్ ఎం. జయంత్‌రెడ్డి తెలిపారు. ఎం.జే.ఆర్ ఇంటర్నేషనల్ తైక్వాండో అకాడమీ, సుమన్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆగస్టు 9న ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో 'లార్జెస్ట్ తైక్వాండో లెసన్' గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కోసం ప్రయత్నించినట్లు జయంత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు తైక్వాండో క్రీడాకారులు, శిక్షకులు పాల్గొన్నారు.

## టీడబ్ల్యూజేఎఫ్ ధర్నాకు కదిలిన ఢిల్లీ పెద్దలు

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 12 (ఈవార్తలు): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో జూలై 27న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన జర్నలిస్టుల ధర్నాపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ధర్నా అనంతరం కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన వినతిపత్రంపై చర్యలు ప్రారంభమయ్యాయి. జర్నలిస్టుల సంక్షేమం, హక్కులు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, చట్టపరమైన రక్షణ తదితర అంశాలపై టీడబ్ల్యూజేఎఫ్ ప్రధానమంత్రి కార్యాలయానికి వినతిపత్రం సమర్పించింది. అక్రిడిటెడ్ జర్నలిస్టులకు 50 శాతం రైల్వే ఛార్జీ రాయితీ, ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సౌకర్యం పునరుద్ధరణ, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సమస్యకు చట్టపరమైన పరిష్కారం, స్వతంత్ర జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు, వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని పునరుద్ధరించడం లేదా సవరణలు చేయడం వంటి డిమాండ్లను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. అలాగే జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం, ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ఉద్యోగులకు రక్షణ, కొత్త వేజ్ బోర్డు ఏర్పాటు, జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం తదితర అంశాలపైనా వినతిపత్రంలో ప్రస్తావించారు. టీడబ్ల్యూజేఎఫ్ సమర్పించిన వినతిపై జూలై 28న ఫిర్యాదు నమోదైంది. సంబంధిత అంశాన్ని పరిశీలించేందుకు మీడియా యూనిట్ సెల్-1కి బదిలీ చేసినట్లు రిజిస్ట్రేషన్ వివరాల్లో పేర్కొన్నారు. మరో కీలక పరిణామంగా.. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆగస్టు 8న ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) కార్యదర్శికి అధికారికంగా లేఖ జారీ చేసింది. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య సమర్పించిన ఫిర్యాదును ప్రస్తావిస్తూ, జర్నలిస్టుల సంక్షేమం, సేవా పరిస్థితులు, చట్టపరమైన రక్షణ, సామాజిక భద్రత, కార్మిక హక్కులకు సంబంధించిన అంశాలపై తగిన చర్యలు తీసుకోవాలని పీసీఐని కోరింది. ఫిర్యాదును వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించింది. జర్నలిస్టుల రైల్వే రాయితీ అంశంపై కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి కూడా స్పందించినట్లు టీడబ్ల్యూజేఎఫ్ తెలిపింది. ఈ అంశంపై రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఆయన లేఖ రాసినట్లు పేర్కొంది. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, పెండింగ్ డిమాండ్లపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య కోరారు.

# ఆగమ నిబంధనల మేరకే రాజన్న ఆలయ అభివృద్ధి

**గర్భాలయం, మహామండపాన్ని మార్చేది లేదు**

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**శిఖర స్థాయి పెంపుపై మాత్రమే పరిశీలన**

**ఇప్పటికే రూ.250 కోట్లతో పనులు**



వేములవాడ అర్బన్, ఆగస్టు 12 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు ఆగమ శాస్త్ర నిబంధనలకు, శృంగేరి పీఠాధిపతి సూచనలకు అనుగుణంగానే కొనసాగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా గర్భాలయం, మహామండపాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చబోమని తెలిపారు. ఆలయ గర్భాలయం, మహామండపాన్ని తొలగిస్తున్నారంటూ గత రెండు రోజులుగా కొన్ని పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంపై భక్తుల్లో నెలకొన్న అనుమానాలను శృంగేరి పీఠాధిపతి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. గర్భాలయం, మహామండపం యథావిధిగా ఉంటాయని పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి రూ.2 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించి పనులు చేపడుతున్నారని ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి ఇప్పటికే సుమారు రూ.250 కోట్లు కేటాయించగా, పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం దాదాపు 55 శాతం పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. గతంలో రూ.50 కోట్లు, అనంతరం రూ.100 కోట్లు, తాజాగా రూ.99.40 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కొండా సురేఖతో పాటు అధికారులు, అర్చకులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. 1973లో నిర్మించిన ప్రస్తుత శిఖరం విషయంలో ఆగమ, సాంకేతిక అంశాలను పరిగణనలోకి తీసుకుని మార్పులు చేపట్టాలని భావిస్తున్నట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు. భవిష్యత్తులో బంగారు తాపడం చేసుకునే అవకాశం ఉండేలా శిఖరాన్ని శిలామయంగా నిర్మించి, దాని స్థాయిని సుమారు నాలుగు అడుగుల మేర పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. శృంగేరి పీఠాధిపతి సూచనల మేరకు ఇటుక, సిమెంట్‌తో ఉన్న శిఖర భాగాన్ని తిరిగి శిలామయంగా నిర్మించాలని భావిస్తున్నట్లు దేవాదాయ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. భక్తులకు దూరం నుంచే శిఖర దర్శనం కలిగేలా, ఆగమ నిబంధనలకు అనుగుణంగా నిర్మించాలని పీఠాధిపతి సూచించినట్లు వివరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అనివెట్టి మండపాన్ని ఆధునికంగా నిర్మిస్తున్నట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు. గతంలో రేకుల షెడ్డు ఉన్న ప్రాంతంలో 20 అడుగులు, 24 అడుగుల విభాగాలతో మండప నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన శృంగేరి పీఠాధిపతి పనులు శుభప్రదంగా ఉన్నాయని, త్వరగా పూర్తి చేయాలని సూచించినట్లు తెలిపారు. అభివృద్ధి పనులకు సుమారు 4.80 లక్షల క్యూబిక్ అడుగుల శిల అవసరమవుతుందని అధికారులు వివరించినట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం, వేములవాడ దేవస్థానం తరఫున ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ముఖ్యమంత్రి కార్యాలయ ప్రతినిధులు, ధార్మిక సలహాదారు గోవింద హరి, జిల్లా కలెక్టర్, వేద పండితులు, ప్రధాన అర్చకులు తదితరులు శృంగేరి పీఠాన్ని సందర్శించి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామివారిని కలిశారు. ఆలయ అభివృద్ధిపై దాదాపు గంటన్నరపాటు చర్చించారు. ఈ సందర్భంగా గర్భాలయాన్ని మార్చడం, దాని విస్తీర్ణాన్ని పెంచడం, మహామండపాన్ని తొలగించడం లేదా మార్చడం వంటి ప్రతిపాదనలు లేవని స్పష్టం చేసినట్లు దేవాదాయ కమిషనర్ తెలిపారు. శృంగేరి పీఠం నుంచి లిఖితపూర్వక సూచనలు, శ్రీముఖం అందనున్న నేపథ్యంలో వాటి ప్రకారమే తదుపరి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. సనాతన సంప్రదాయాలు, ప్రాచీన ఆలయాల పరిరక్షణతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆది శ్రీనివాస్ తెలిపారు. ఆగమ శాస్త్రం, భక్తుల మనోభావాలు, శృంగేరి పీఠాధిపతి సూచనలకు అనుగుణంగానే రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని, గర్భాలయం, మహామండపాన్ని ముట్టేది లేదని మరోసారి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు బాగా పండాలని, రైతులు, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని శృంగేరి పీఠాధిపతి ఆశీస్సులు తీసుకున్నట్లు తెలిపారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు శరత్ శర్మ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి, నిర్మాణ పనులకు సంబంధించి శృంగేరి దక్షిణామ్నాయ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ జగద్గురు భారతీతీర్థ మహాస్వామి, శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి మహాస్వాములను ఆలయ అధికారులు, ప్రతినిధులు దర్శించుకుని ఆశీస్సులు పొందారని తెలిపారు.

## నూకలమర్రిలో ఘనంగా హర్ ఘర్ తిరంగా



వేములవాడ అర్బన్, ఆగస్టు 12 (ఈవార్తలు): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాలను చేతబూని దేశభక్తిని చాటుతూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 'జైహింద్', 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బూరుగుపల్లి పరమేష్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవడంతో పాటు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడం ద్వారా దేశ సమైక్యత, సార్వభౌమత్వం, దేశభక్తి భావాలను మరింతగా పెంపొందించడమే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. యువత దేశ చరిత్ర, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను తెలుసుకుని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను గౌరవిస్తూ 'దేశం ముందు.. మనం తరువాత' అనే భావనతో ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బండ మల్లేశం, అధికార ప్రతినిధి సుంకరి నరేందర్, మండల ప్రధాన కార్యదర్శులు వనపర్తి పరశురాములు, తోట శేఖర్, మండల ఉపాధ్యక్షుడు కుంటి వంశీకృష్ణ, మండల కార్యదర్శి రాజేందర్, బూత్ అధ్యక్షుడు లింగంపల్లి కిషోర్, సీనియర్ నాయకులు చిట్టితల్లి రవి, కిషోర్, గుడిసె రమేష్, జంగం వంశీ, సమోజు గౌతమ్, ఆవునూరి తిరుపతి, నేదూరి లక్ష్మణ్, మారాజు దిలీప్, జంగం సాయి, శ్రీరామోజు శివ, గ్రామ ప్రజలు, యువకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మల్యాలలో వైభవంగా తిరంగా యాత్ర



మల్యాల, ఆగస్టు 12 (ఈవార్తలు): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ మల్యాల మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో 'హర్ ఘర్ తిరంగా' యాత్ర, భారీ బైక్ ర్యాలీ ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉదయం 9 గంటలకు బ్లాక్ చౌరస్తా వద్ద ప్రారంభమైన పాదయాత్ర అంగడి బజార్ వరకు కొనసాగింది. అనంతరం బ్లాక్ చౌరస్తా నుంచి కొండగట్టు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు జాతీయ జెండాలు చేతబూని దేశభక్తి నినాదాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం మాట్లాడుతూ.. "మన జెండా.. మన గౌరవం. ప్రతి ఇంటా జాతీయ జెండాను ఎగురవేసి, ప్రతి హృదయంలో దేశభక్తి భావనను పెంపొందించడమే 'హర్ ఘర్ తిరంగా' యాత్ర ముఖ్య ఉద్దేశం" అని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ జాతీయ సమైక్యత, దేశభక్తి భావాలను ప్రజల్లో మరింతగా పెంపొందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బత్తుల లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు బింగి వేణు, బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, గుజ్జు శ్రీనివాస్, వన్ హాస్పిటల్ అధినేత డాక్టర్ మరి మహేష్‌రెడ్డి, సర్పంచులు బొట్ల జయ ప్రసాద్, సంకుర్తి తిరుపతి, గడ్డం నడి మల్లేశం, చీకట్లో లత, వక్కలభరణ మౌర్య, మండల ప్రధాన కార్యదర్శులు పొన్నం సాయికుమార్, పిల్లి రాజశేఖర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు గౌతమ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు సామ మైపాల్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు పరమేష్, ఉప సర్పంచులు మల్లేశం యాదవ్, వినోద్, శంకర్, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నారాయణపూర్ కుడికాలువ పూర్తి చేస్తాం

**ప్రాజెక్టు అభివృద్ధికి 43.50 కోట్లు మంజూరు చేయించాం: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

గంగాధర, ఆగస్టు 12 (ఈవార్తలు): నారాయణపూర్ రిజర్వాయర్‌తో పాటు కుడికాలువ నిర్మాణాన్ని పూర్తి చేసి ఈ ప్రాంత భూములను సస్యశ్యామలం చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. నారాయణపూర్ ప్రాజెక్టు అభివృద్ధి పనులకు రూ.43.50 కోట్లు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. బుధవారం గంగాధర మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నారాయణపూర్ రిజర్వాయర్ కింద ముంపునకు గురవుతున్న భూములు, ఇళ్ల సమస్యలతో పాటు కట్ట ఎత్తు పెంపు, బండ్ పటిష్టత, కాలువల నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి సమస్యలను తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించామని తెలిపారు. త్వరలోనే కుడికాలువ నిర్మాణ పనులను ప్రారంభించి ఏడాది కాలంలో పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేయిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం నారాయణపూర్ రిజర్వాయర్ కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఎమ్మెల్యే విమర్శించారు. పనులు చేయలేక బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. నారాయణపూర్ నిర్వాసితులకు ఎలాంటి అన్యాయం జరగనివ్వబోమని, దశలవారీగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చొప్పదండి నియోజకవర్గ ప్రజలను కడుపులో పెట్టుకుని కాపాడుకుంటామని ఎమ్మెల్యే సత్యం అన్నారు. కార్యక్రమంలో గంగాధర, బోయినపల్లి మండలాల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు ముద్ర నగేష్, భీమ్‌రెడ్డి మహేశ్వర్‌రెడ్డి, సర్పంచులు వేముల భాస్కర్, బారాజు ప్రభాకర్‌రెడ్డి, బాస వేణి శ్రీనివాస్, ఉయ్యాల శ్రీనివాస్‌గౌడ్, ఏనుగుల కనకయ్య, రోమల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఇందిరమ్మ టవర్స్‌కు సీఎం భూమిపూజ

కూకట్‌పల్లి, ఆగస్టు 11 (ఈవార్తలు): కూకట్‌పల్లి నియోజకవర్గంలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. కేపీహెచ్‌బీ ఎల్ఐజీ ఫ్లాట్స్ వద్ద పేద, మధ్యతరగతి ప్రజల కోసం నిర్మించనున్న ప్రతిష్ఠాత్మక ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేయనున్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కమ్మ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ బండి రమేష్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార-పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచే నాయకులు, కార్యకర్తలు, ప్రజల సమీకరణ ప్రారంభం కానుండగా, సాయంత్రం 4 గంటలకు ఇందిరమ్మ టవర్స్ శంకుస్థాపన కార్యక్రమం జరగనుంది. పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన గృహ వసతి కల్పించడంతో పాటు ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పార్టీ నాయకులు తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు సీఎం శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా, యువజన విభాగాల ప్రతినిధులు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## రాష్ట్రాల పరిధిలోనే వైద్య ప్రవేశ పరీక్షలు

**ప్రధానికి మాజీ మంత్రి జీవన్‌రెడ్డి లేఖ**



జగిత్యాల, ఆగస్టు 12 (ఈవార్తలు): వైద్య విద్య ప్రవేశ పరీక్ష నిర్వహణ బాధ్యతలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి కోరారు. నీట్ విధానంపై విద్యార్థుల ఆందోళనలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని ప్రధాని నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ప్రధానికి రాసిన లేఖను ఆయన పత్రికలకు విడుదల చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్‌టీఏ ఆధ్వర్యంలో నీట్ పరీక్ష నిర్వహిస్తున్నారని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్షల నిర్వహణలో అవకతవకలు వంటి ఘటనల ప్రభావం దేశవ్యాప్తంగా విద్యార్థులపై పడుతోందన్నారు. ఒక రాష్ట్రంలో చోటుచేసుకున్న లోపాలకు దేశంలోని అన్ని రాష్ట్రాల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. పోటీ పరీక్షల్లో అవకతవకలు విద్యార్థుల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతున్నాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఒకే ప్రవేశ పరీక్ష విధానం అమలు చేయడం వల్ల ఆయా రాష్ట్రాల స్థానిక విద్యార్థులు తమ ప్రాంతంలో అందుబాటులో ఉన్న వైద్య విద్యా అవకాశాలను పూర్తిస్థాయిలో పొందలేకపోతున్నారనే ఆందోళన ఉందన్నారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు నీట్ విధానంపై మొదటి నుంచీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయని గుర్తుచేశారు. తెలంగాణలో వైద్య కళాశాలలు పెరగడంతో స్థానిక విద్యార్థులకు వైద్య విద్యలో మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని, వాటిని రాష్ట్ర కోటా ద్వారా సద్వినియోగం చేసుకునేలా చర్యలు అవసరమని అన్నారు. నీట్‌లో చోటుచేసుకున్న అవకతవకల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సంస్కరణలు చేపట్టడం, నిపుణుల కమిటీలను ఏర్పాటు చేయడం స్వాగతించదగినదేనని జీవన్‌రెడ్డి అన్నారు. అయితే దేశవ్యాప్తంగా ఒకే పరీక్ష నిర్వహించే విధానంలో సాంకేతిక లోపం లేదా ప్రశ్నపత్రాల లీకేజీ జరిగితే కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల నీట్ విధానాన్ని పునఃసమీక్షించి, అవసరమైన చట్టపరమైన సవరణలు చేపట్టాలని కోరారు. రాష్ట్రాల జనాభాకు అనుగుణంగా వైద్య కళాశాలలు, సీట్లను పెంచడంతోపాటు, వైద్య విద్య ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించాలని ప్రధానికి రాసిన లేఖలో జీవన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## పత్రాలు లేని 21 వాహనాలు సీజ్

జగిత్యాల, ఆగస్టు 12 (ఈవార్తలు): నిబంధనలు ఉల్లంఘిస్తూ రోడ్లపై తిరుగుతున్న వాహనాలపై జగిత్యాల రవాణా శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. జగిత్యాల పట్టణంలోని కొత్త బస్టాండ్ చౌరస్తా వద్ద బుధవారం ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించి, పన్నులు చెల్లించని, ఫిట్‌నెస్ తదితర ధ్రువపత్రాలు సక్రమంగా లేని 21 వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. వాహనాల తనిఖీల్లో భాగంగా అధికారులు ఒక్కో వాహనం రిజిస్ట్రేషన్, పన్ను చెల్లింపులు, ఫిట్‌నెస్, ఇతర అవసరమైన ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పలు వాహనాలు గుర్తించడంతో వాటిపై చర్యలు చేపట్టారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలను నడపడం వల్ల ప్రమాదాల ముప్పుతో పాటు ప్రభుత్వ ఆదాయానికి కూడా నష్టం వాటిల్లే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. వాహన యజమానులు, డ్రైవర్లు తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన పన్నులు సకాలంలో చెల్లించడంతో పాటు ఫిట్‌నెస్ ధ్రువపత్రాన్ని కలిగి ఉండాలని జిల్లా రవాణా శాఖ అధికారి మహమ్మద్ సందాని సూచించారు. వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు సక్రమంగా ఉన్నప్పుడే రహదారులపై వాహనాలను నడపాలని తెలిపారు. రవాణా నిబంధనలను ఉల్లంఘించే వాహనాలపై తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. పత్రాలు లేకుండా వాహనాలను నడిపితే సీజ్ చేయడంతో పాటు నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో ఎంవీఐలు రామారావు, సాయిచరణ్‌తో పాటు రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లతో పాటు రద్దీ ప్రాంతాల్లోనూ వాహన తనిఖీలు కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.



## మార్కెట్లోకి గూగుల్ పిక్సెల్ 11, ప్రో ఫోన్లు

**రూ.89,999 నుంచి ప్రారంభం కానున్న ధరలు**

**7 ఏళ్ల పాటు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్ అందిస్తామన్న గూగుల్**

న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం గూగుల్ తన సరికొత్త ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్ సిరీస్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. 'మేడ్ బై గూగుల్' ఈవెంట్‌లో పిక్సెల్ 11, పిక్సెల్ 11 ప్రో, పిక్సెల్ 11 ప్రో ఎక్స్‌ఎల్ మోడళ్లను అధికారికంగా ఆవిష్కరించింది. సరికొత్త టెన్సర్ జీ6 ప్రాసెసర్, అత్యాధునిక జెమిని ఏఐ సామర్థ్యాలు, మెరుగైన భద్రతా ఫీచర్లతో ఈ ఫోన్లు వినియోగదారుల ముందుకు రానున్నాయి. భారత్‌లో పిక్సెల్ 11 (12జీబీ౦256జీబీ) బేస్ వేరియంట్ ప్రారంభ ధరను రూ. 89,999గా నిర్ణయించారు. అలాగే పిక్సెల్ 11 ప్రో ధర రూ. 1,19,999 నుంచి, పిక్సెల్ 11 ప్రో ఎక్స్‌ఎల్ ధర రూ. 1,34,999 నుంచి ప్రారంభం కానుంది. గత సిరీస్‌తో పోలిస్తే ఈసారి ధరలు సుమారు రూ. 10,000 వరకు పెరిగాయి. గూగుల్ స్టోర్‌తో పాటు ఇతర రిటైల్ భాగస్వాముల వద్ద ఇప్పటికే ప్రీ-ఆర్డర్లు ప్రారంభమవగా, ఆగస్టు 20 నుంచి ఈ ఫోన్లు విక్రయానికి అందుబాటులోకి రానున్నాయి. ఈ మూడు మోడళ్లలోనూ గూగుల్ తన సొంత టెన్సర్ జీ6 చిప్‌సెట్‌ను టైటాన్ ఎం3 సెక్యూరిటీ కో-ప్రాసెసర్‌తో జత చేసింది. ఆండ్రాయిడ్ 17 ఆపరేటింగ్ సిస్టమ్‌తో వస్తున్న ఈ స్మార్ట్‌ఫోన్లకు ఏడు సంవత్సరాల పాటు ఓఎస్, సెక్యూరిటీ అప్‌డేట్స్ అందిస్తామని గూగుల్ ప్రకటించింది.

## గిగ్ వర్కర్లకు 99తోనే పెన్షన్ పొదుపు!

న్యూఢిల్లీ: జొమాటో, స్విగ్గీ, ఓలా, ఉబర్, బ్లింకిట్ వంటి సంస్థలలో సేవలందిస్తున్న గిగ్ వర్కర్లు (ప్లాట్‌ఫామ్ వర్కర్లు) ఇకపై తమ పదవీ విరమణ అవసరాల కోసం సులభంగా పొదుపు చేసుకోవచ్చు. కేవలం రూ. 99 కనీస మొత్తంతో జాతీయ పింఛను పథకంలో (ఎన్‌పీఎస్) చేరే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌ఆర్‌డీఏ) బుధవారం వెల్లడించింది. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. 'మీ పని తర్వాతి బుకింగ్‌పై ఆధారపడి ఉండవచ్చు, కానీ మీ రిటైర్మెంట్ అలా కాదు' అని పీఎఫ్‌ఆర్‌డీఏ పేర్కొంది. గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ ఎన్‌పీఎస్ విధానంలో, కనీస లేదా గరిష్ఠ పరిమితుల నిబంధనలు లేకుండా తమ వెసులుబాటును బట్టి పొదుపు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. గతేడాది అక్టోబర్ 29న పీఎఫ్‌ఆర్‌డీఏ జారీ చేసిన సర్క్యులర్ ద్వారా 'ఎన్‌పీఎస్ ఈ-శ్రామిక్ (ప్లాట్‌ఫామ్ సర్వీస్ పార్ట్‌నర్) మోడల్‌'ను ప్రవేశపెట్టింది. దీని ప్రకారం, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా సేవలు అందించే గిగ్ వర్కర్లు ఈ పథకంలో చేరవచ్చు. ఇందులో వర్కర్, యాజమాన్యం కలిసి లేదా విడివిడిగా తమ వాటాలను చెల్లించవచ్చు. ప్లాట్‌ఫామ్ కంపెనీలు నేరుగా పీఎఫ్‌ఆర్‌డీఏలో నమోదు కాకుండా, పాయింట్స్ ఆఫ్ ప్రెజెన్స్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని తమ వర్కర్లను ఎన్‌పీఎస్‌లో చేర్పించవచ్చు. ఆధార్ ఆధారిత ఈ-కేవైసీ ద్వారా వర్కర్ వివరాలను సేకరించి, వారి అనుమతితో పర్మినెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నంబర్ (ప్రాన్) కేటాయిస్తారు. ప్రారంభంలో ప్లాట్‌ఫామ్ కంపెనీయే ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్, పెన్షన్ ఫండ్‌ను ఎంపిక చేసినప్పటికీ, తదుపరి కాలంలో ఉద్యోగి తన ఇష్టానుసారం వాటిని మార్చుకునే సౌలభ్యం ఉంటుంది. అస్థిర ఆదాయం కలిగిన గిగ్ వర్కర్లను పదవీ విరమణ పొదుపు పథకాల పరిధిలోకి తీసుకురావడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం.

## 68,000 కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఉఫ్!

ముంబై: టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ నిర్ణయం టాటా గ్రూప్ షేర్లపై తీవ్ర ప్రభావం చూపింది. ఆయన మళ్లీ ఛైర్మన్‌గా కొనసాగేందుకు ఆసక్తి చూపడం లేదన్న వార్తతో బుధవారం టాటా గ్రూప్ షేర్లలో భారీ అమ్మకాలు వెల్లువెత్తాయి. దీంతో గ్రూప్‌లోని 17 లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ ఏకంగా రూ.68,119 కోట్లు ఆవిరైంది. చంద్రశేఖరన్ నిర్ణయం వెలువడిన వెంటనే ఇన్వెస్టర్లలో ఆందోళన మొదలైంది. టాటా గ్రూప్‌లోని కీలక కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. ఫలితంగా గత సెషన్‌లో దాదాపు రూ.27 లక్షల కోట్లుగా ఉన్న మొత్తం మార్కెట్ విలువ.. బుధవారం రూ.26.32 లక్షల కోట్లకు పడిపోయింది. ఈ పతనంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ముందుంది. కంపెనీ మార్కెట్ విలువ ఒక్కరోజులో రూ.42,440 కోట్లు తగ్గింది. షేరు 4.79 శాతం పడిపోయి రూ.2,323.30 వద్ద ముగిసింది. టైటాన్ మార్కెట్ విలువ రూ.9,304 కోట్లు తగ్గింది. టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ రూ.4,898 కోట్లు, టాటా స్టీల్ రూ.4,745 కోట్లు కోల్పోయాయి. టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, టాటా పవర్, ఇండియన్ హోటల్స్ కూడా నష్టపోయాయి. అయితే అన్ని టాటా షేర్లూ పడిపోలేదు. టాటా మోటార్స్ మార్కెట్ విలువ రూ.1,786 కోట్లు పెరిగింది. టాటా క్యాపిటల్ రూ.700 కోట్లు, టాటా కెమికల్స్ రూ.167 కోట్లు, వోల్టాస్ రూ.66 కోట్లు తమ మార్కెట్ క్యాపిటల్‌కు జోడించాయి. చంద్రశేఖరన్ తన పదవీకాలం ముగిసిన తర్వాత మళ్లీ ఛైర్మన్‌గా కొనసాగబోనని ప్రకటించారు. పునర్నియామకంపై ఏర్పడిన అనిశ్చితి నేపథ్యంలో వారసత్వ ప్రణాళికపై బోర్డు ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.

## రాహుల్ గత జన్మలో జిన్నా

**బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే ఫైర్**



న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాకిస్థాన్ వ్యవస్థాపకుడు మహమ్మద్ అలీ జిన్నా, రాహుల్ గాంధీ రూపంలో పునర్జన్మించారని, జిన్నా కంటే కూడా రాహుల్ అత్యంత ప్రమాదకరమైన నాయకుడని బుధవారం ఆయన విమర్శించారు. ఈ మేరకు తన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. జార్ఖండ్లో ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలపై విద్యార్థులు చేపట్టిన నిరసనల నేపథ్యంలో దూబే ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కుంభకోణంపై సీబీఐ విచారణను కాంగ్రెస్ పార్టీ ఎందుకు వ్యతిరేకిస్తోందని ఆయన నిలదీశారు. ప్రధాన నిందితుడు జార్ఖండ్ ప్రభుత్వంలోని ఒక సీనియర్ అధికారి నివాసంలో పట్టుబడ్డాడని, ఒకవేళ సీబీఐ విచారణ నిష్పక్షపాతంగా జరిగితే ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు కూడా చిక్కులు తప్పవని ఆరోపించారు. విద్యార్థులకు నిజంగా సంఘీభావం తెలపాలనుకుంటే జార్ఖండ్ ప్రభుత్వానికి కాంగ్రెస్ తన మద్దతును వెంటనే ఉపసంహరించుకోవాలని దూబే సవాల్ విసిరారు. లేనిపక్షంలో ఆ పార్టీ జార్జ్ సోరోస్ అజెండాతో పనిచేస్తున్నట్లు భావించాల్సి ఉంటుందని అన్నారు. ప్రధానికి వ్యతిరేకంగా ఎక్కడ నిరసనలు జరిగినా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షమవుతున్నారని ఆయన మండిపడ్డారు.



# 24 గంటలు సభలో ఉంటా

## నేటి మధ్యాహ్నం వరకు చాన్స్.. ఏ ప్రశ్నకైనా సమాధానమిస్తా

**ప్రతిపక్షాలకు అమిత్ షా సవాల్**

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో కొనసాగుతున్న ప్రతిష్టంభనకు తెరదించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రతిపక్షానికి కీలక ప్రతిపాదన చేశారు. ఏ ప్రశ్న అడిగినా సమాధానం ఇచ్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు సభలోనే ఉంటానని చెప్పారు. ఈ 24 గంటల్లో ప్రతిపక్షం లేవనెత్తే అంశాలపై చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. నీట్ విద్యార్థుల ఆందోళనలపై జరిగిన పోలీసు చర్యకు సంబంధించి అమిత్ షా ప్రకటన చేయాలని ప్రతిపక్షం డిమాండ్ చేస్తోంది. అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగంపై కూడా చర్చ కోరుతోంది. ఈ డిమాండ్లతో పార్లమెంట్‌లో కార్యకలాపాలు స్తంభించాయి. చర్చకు సిద్ధంగా ఉంటే అధికారికంగా లేఖ ఇవ్వాలని అమిత్ షా ప్రతిపక్షాన్ని కోరారు. "లేఖ రాసి ఇవ్వండి. ఇవాళ మధ్యాహ్నం 3 గంటల నుంచి చర్చిద్దాం. రేపు మధ్యాహ్నం 3 గంటల వరకు చర్చించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను" అని చెప్పారు. ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని అమిత్ షా స్పష్టం చేశారు. చర్చ జరగాలా? సభను కొనసాగకుండా అడ్డుకోవాలా? అన్నది ఇప్పుడు ప్రతిపక్షమే నిర్ణయించుకోవాలని అన్నారు. పార్లమెంట్‌కు తాను రావడం లేదంటూ ప్రతిపక్షం చేస్తున్న విమర్శలను కూడా షా ఖండించారు. వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి తాను క్రమం తప్పకుండా సభకు హాజరవుతున్నానని చెప్పారు. పార్లమెంట్ కార్యకలాపాలను అడ్డుకుంటున్నది ప్రతిపక్షమేనని అమిత్ షా ఆరోపించారు. సభకు వచ్చి పదేపదే కార్యకలాపాలను అడ్డుకుంటే ప్రయోజనం ఏంటని ప్రశ్నించారు. నీట్ ఆందోళనలపై చర్చకు ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని చెప్పారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కూడా ఈ అంశంపై అన్ని విషయాలు చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారని గుర్తుచేశారు. "చర్చకు వారు సిద్ధంగా లేరు. ఇప్పుడు ఎవరు పారిపోతున్నారో ప్రజలే నిర్ణయించాలి" అని షా వ్యాఖ్యానించారు.

# డిజిలాకర్‌కు 72 కోట్ల యూజర్లు

**మూడేళ్లలో ఉమంగ్‌లో 798 కోట్ల లావాదేవీలు**







న్యూఢిల్లీ: దేశంలో డిజిటల్ సేవలు విస్తృతంగా ప్రజలకు చేరువవుతున్నాయని, ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ ప్లాట్‌ఫామ్‌లైన 'డిజిలాకర్', 'ఉమంగ్' అద్భుతమైన వృద్ధిని నమోదు చేస్తున్నాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. నేడు రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ.. గత మూడేళ్లలో డిజిలాకర్ వినియోగదారుల సంఖ్య 72.43 కోట్లకు చేరిందని, ఈ ప్లాట్‌ఫామ్‌పై 72.86 కోట్ల డాక్యుమెంట్ యాక్సెస్ లావాదేవీలు జరిగాయని వెల్లడించారు. అదే సమయంలో 'ఉమంగ్' ప్లాట్‌ఫామ్‌లో 11.66 కోట్లకు పైగా యూజర్లు నమోదు కాగా, సుమారు 798 కోట్ల లావాదేవీలు నమోదైనట్లు వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనలకు అనుగుణంగా, టెక్నాలజీని సామాన్య ప్రజలకు దగ్గర చేసే లక్ష్యంతో 2015 జులైలో 'డిజిటల్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మంత్రి గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పౌర కేంద్రీకృత సేవలను సులభంగా అందించేందుకు అనేక చర్యలు తీసుకున్నామన్నారు. ఈ ఏడాది జులై 31 నాటికి దేశవ్యాప్తంగా ఉమాంగ్ ప్లాట్‌ఫామ్‌పై 2,575 సేవలు (కేంద్రం: 880, రాష్ట్రాలు: 1,695), డిజిలాకర్‌పై 5,437 రకాల డాక్యుమెంట్లు/సేవలు (కేంద్రం: 661, రాష్ట్రాలు: 4,776) అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో డిజిటల్ సేవలను అందించేందుకు 'కామన్ సర్వీస్ సెంటర్ల' (సీఎస్‌సీ) నెట్‌వర్క్‌ను ప్రభుత్వం విస్తరించిందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. 2026 జూన్ 30 నాటికి గ్రామ పంచాయతీ స్థాయిలో 4,07,122 సీఎస్‌సీలు పనిచేస్తున్నాయని, వీటిలో 70,069 కేంద్రాలను మహిళా పారిశ్రామికవేత్తలు (విలేజ్ లెవల్ ఎంటర్‌ప్రెన్యూర్స్) నిర్వహిస్తుండటం విశేషమని అన్నారు. ప్రభుత్వ, బ్యాంకింగ్, ఆర్థిక, బీమా, పింఛను వంటి అనేక సేవలను ఈ కేంద్రాల ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. ఉమంగ్, డిజిలాకర్ ప్లాట్‌ఫామ్‌లు మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్స్ ద్వారా అందుబాటులో ఉన్నాయని, దీనివల్ల పౌరులు ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా ప్రభుత్వ సేవలను పొందవచ్చని మంత్రి వివరించారు. ఆధార్, ఈ-సైన్, ఏపీఐ సేతు వంటి కీలకమైన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో ఈ ప్లాట్‌ఫామ్‌లను అనుసంధానించామని, తద్వారా సురక్షితమైన, కాగితరహిత సేవలు అందించడం సాధ్యమవుతోందని తెలిపారు. ఈ విధానం వల్ల భౌతికంగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే అవసరం తగ్గి, పౌరులకు సమర్థవంతమైన సేవలు అందుతున్నాయని ఆయన స్పష్టం చేశారు.

## జార్ఖండ్ నిరసనకారులను కొట్టలేదు

**ప్రభుత్వాన్ని సమర్థించిన కాంగ్రెస్**

రాంచీ: జార్ఖండ్లో ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంకీర్ణ ప్రభుత్వానికి పూర్తి మద్దతు ప్రకటించింది. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై ఎటువంటి బలప్రయోగం జరగలేదని ఈ సందర్భంగా పార్టీ స్పష్టం చేసింది. ఈ అంశాన్ని పక్కదారి పట్టించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, 'ఎగ్జామ్ మాఫియా'ను రక్షించేందుకే ఇదంతా చేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. బుధవారం నాడు కాంగ్రెస్ మంత్రులు విలేకరులతో మాట్లాడుతూ, నిరసనలు తీవ్రరూపం దాల్చకముందే పేపర్ లీకేజీలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుందని వెల్లడించారు. రాష్ట్ర సీఐడీ విచారణకు బదులుగా సీబీఐ దర్యాప్తును బీజేపీ డిమాండ్ చేయడం వెనుక ఎగ్జామ్ మాఫియాను రక్షించాలనే దురుద్దేశం ఉందని వారు మండిపడ్డారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు బీజేపీ ప్రభుత్వం యువత గొంతు నొక్కిందని వారు విమర్శించారు. 2015 నుంచి దేశవ్యాప్తంగా బీజేపీ పాలనలో 152 పేపర్ లీకేజీలు జరిగితే, సీబీఐ కేవలం 17 కేసులనే మాత్రమే విచారించిందని, వాటిలో ఒక్క కేసులోనూ శిక్షలు పడలేదని కాంగ్రెస్ గణాంకాలను ఉదహరించింది. కేంద్రం ఒత్తిడితోనే జార్ఖండ్ బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారని, ఆగస్టు 10న శాంతియుతంగా సాగుతున్న నిరసనలను పక్కదారి పట్టించేందుకు బయటి వ్యక్తులను రంగంలోకి దించారని ఆరోపించింది. మరోవైపు, జేఎస్ఎస్‌సీ-సీజీఎల్ పరీక్షను రద్దు చేయాలని, జేపీఎస్‌సీ, జేఎస్ఎస్‌సీ నియామకాల్లోని అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ విద్యార్థులు నిరసనలు కొనసాగిస్తున్నారు. అసెంబ్లీ ముట్టడికి యత్నించిన విద్యార్థులపై పోలీసులు వాటర్ కేనన్లు ప్రయోగించడంతో పాటు బలప్రయోగం చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. తాము విద్యార్థులతో సంప్రదింపులు జరుపుతున్నామని, వారి డిమాండ్లలో చాలావరకు అంగీకరించామని ప్రభుత్వం పేర్కొంటుండగా, విద్యార్థులు మాత్రం ఈ వాదనను తోసిపుచ్చుతూ తమ పోరాటాన్ని సాగిస్తున్నారు.

## న్యూయార్క్, న్యూజెర్సీలో అధికారిక 'పంద్రాగస్టు'

బోస్టన్: భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభిస్తోంది. దీనికి నిదర్శనంగా అమెరికాలోని రెండు కీలక రాష్ట్రాలైన న్యూయార్క్, న్యూజెర్సీలు ఆగస్టు 15వ తేదీని 'ఇండియా ఇండిపెండెన్స్ డే'గా అధికారికంగా ప్రకటించాయి. వలస పాలన నుంచి భారతదేశం స్వాతంత్ర్యం పొందిన చారిత్రక ప్రయాణాన్ని, అమెరికా అభివృద్ధిలో భారతీయ-అమెరికన్ల భాగస్వామ్యాన్ని గౌరవిస్తూ ఈ ప్రకటనలు వెలువడ్డాయి. న్యూయార్క్ గవర్నర్ కేథీ హోచుల్, న్యూజెర్సీ గవర్నర్ మైకీ షెరిల్ 2026 ఆగస్టు 15వ తేదీని 'ఇండియా ఇండిపెండెన్స్ డే'గా గుర్తిస్తూ వేర్వేరుగా అధికారిక ప్రకటనలు జారీ చేశారు. ఈ విషయాన్ని న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ కార్యాలయం ధ్రువీకరించింది. ఈ గుర్తింపు ప్రపంచంలోని రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలైన భారత్, అమెరికాల మధ్య ఉన్న ఉమ్మడి విలువలకు, బలమైన స్నేహ బంధానికి ప్రతీక అని కాన్సులేట్ పేర్కొంది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ పెద్ద సంఖ్యలో, ఎంతో ప్రభావవంతమైన భారతీయ-అమెరికన్ సమాజం నివసిస్తోంది. వ్యాపారం, వైద్యం, సాంకేతికత, విద్య, ప్రజా సేవ, సామాజిక నాయకత్వం వంటి అనేక రంగాల్లో వారు అందిస్తున్న విశేష సేవలను ఈ ప్రకటనలు ప్రత్యేకంగా కొనియాడాయి. ముఖ్యంగా న్యూయార్క్ గవర్నర్ కేథీ హోచుల్ తన ప్రకటనలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా భారతదేశం చేసిన స్వాతంత్ర్య పోరాటాన్ని, స్వయం నిర్ణయాధికారం, ప్రజాస్వామ్యం పట్ల దేశానికున్న నిబద్ధతను ప్రస్తావించారు. ఇది ఈ గుర్తింపునకు చారిత్రక ప్రాధాన్యతను చేకూర్చింది. ఈ గౌరవం కేవలం న్యూయార్క్, న్యూజెర్సీలకే పరిమితం కాలేదు. ఇటీవలే మసాచుసెట్స్ గవర్నర్ మౌరా హీలీ, బోస్టన్ మేయర్ మిషెల్ వూ కూడా ఆగస్టు 15వ తేదీని 'ఇండియా డే'గా ప్రకటిస్తూ అధికారిక ప్రకటనలు విడుదల చేశారు.

# లుంగీవాలా..!

## రాజ్యసభను కుదిపేసిన వివాదం

**సుస్మితా దేవ్ వర్సెస్ జాన్ బ్రిట్టాస్**

**ఒకరినొకరిపై హక్కుల ఉల్లంఘన నోటీసులు**



న్యూఢిల్లీ: రాజ్యసభలో బుధవారం 'లుంగీవాలా' వివాదం తీవ్ర దుమారం రేపింది. తనను ఉద్దేశించి బీజేపీ ఎంపీ సుస్మితా దేవ్ ఈ పదాన్ని ఉపయోగించారని కేరళకు చెందిన సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఆరోపించడంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. సోమవారం నాడు సభలో తాను ఆదాయపు పన్ను సవరణ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న సమయంలో, పంచె కట్టుకుని ఉన్న తనను చూసి వెనుక సీటులో కూర్చున్న సుస్మితా దేవ్ పదేపదే 'లుంగీవాలా' అని సంబోధించారని బ్రిట్టాస్ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇది దక్షిణాది సంస్కృతిని, మలయాళీలను అవమానించడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను గర్వించదగ్గ భారతీయుడినని, దక్షిణాది వాడినని పేర్కొంటూ, ఈ వ్యాఖ్యలపై సుస్మితా దేవ్‌పై హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ ఆరోపణలను సుస్మితా దేవ్ తీవ్రంగా ఖండించారు. తాను అసోంకు చెందిన బెంగాలీనని, వివిధ రాష్ట్రాల వస్త్రధారణ పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని స్పష్టం చేశారు. బ్రిట్టాస్ అసత్యాలు చెబుతున్నారని, ఏ విచారణలోనైనా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా, మతపరమైన గుర్తింపులపై బ్రిట్టాస్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై ఆమె కూడా ప్రివిలేజ్ నోటీసు దాఖలు చేశారు. ఈ వివాదంపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. కొందరు ఎంపీలు పార్లమెంట్ వెలుపల పంచెకట్టుతో నిరసన తెలిపారు. సభా నాయకుడు జె.పి. నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు జోక్యం చేసుకుని, సభా మర్యాదలను కాపాడాలని సభ్యులను కోరారు. సభ్యులు ఒకరి సాంస్కృతిక సంప్రదాయాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయవద్దని సూచించిన చైర్మన్, ఇరుపక్షాలను తన ఛాంబర్‌కు పిలిచి సమస్య పరిష్కారానికి ప్రయత్నించారు. ప్రస్తుతం ఇరుపక్షాలు అందజేసిన హక్కుల ఉల్లంఘన నోటీసులు చైర్మన్ పరిశీలనలో ఉన్నాయి.









## ఇరగదీసేలా 'ఇరుముడి' ట్రైలర్

మాస్ మహారాజా రవితేజ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా సినిమా ఇరుముడి. ప్రియా భవాని శంకర్, సాయి కుమార్ ప్రత్యేక పాత్రలలో కనిపించనున్న ఈ ఇరుముడి సినిమాకు శివ నిర్వాణ దర్శకత్వం వహించారు. జీవి ప్రకాశ్ సంగీత స్వరాలు సమకూర్చారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో వచ్చిన ఈ సినిమా ట్రైలర్ తాజాగా రిలీజ్ అయింది. ఇందులో తండ్రి సెంటిమెంట్, రవితేజ డైలాగ్స్ అదిరిపోయాయి. రవితేజతో పాటు కూతురు పాత్ర చేసిన బేబీ నక్షత్ర కూడా అదరగొట్టింది. ఇక ఈ ట్రైలర్ లో జీవి ప్రకాశ్ దీ+వీ ఇరగదీశారు. తాజాగా విడుదలైన ఈ ట్రైలర్, ఇరుముడి సినిమాకు హైప్ తీసుకువచ్చింది. మరి థియేటర్లలో జనాలను ఏ మాత్రం ఆకట్టుకుంటుందో చూడాలి. భక్తి నేపథ్యంలో వస్తున్న ఈ సినిమా ఈనెల 21వ తేదీన థియేటర్స్ లలో విడుదల కానుంది.

## క్షేమంగా ఉన్నా: ఎన్టీఆర్

సర్జరీ విజయవంతం అయిన నేపథ్యంలో జూనియర్ ఎన్టీఆర్ సంచలన ట్వీట్ చేశారు. తాను క్షేమంగానే ఉన్నానంటూ ప్రకటించారు. ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదని పేర్కొన్నారు. సికింద్రాబాద్ లోని కిమ్స్ ఆస్పత్రిలో బుధవారం జూనియర్ ఎన్టీఆర్ భుజానికి సర్జరీ జరిగింది. ఈ సర్జరీ పూర్తయిన తర్వాత ఆయన ఆరోగ్యంగా ఉన్నారని హెల్త్ బులిటెన్ కూడా కిమ్స్ వైద్యులు విడుదల చేశారు. ఈ క్రమంలో తన సర్జరీపై స్వయంగా జూనియర్ ఎన్టీఆర్ స్పందించారు. మీ అందరి నుంచి వెల్లువెత్తిన ప్రేమ,



ప్రార్థనలు తనను ముంచెత్తాయి అంటూ వెల్లడించారు. సర్జరీ విజయవంతమైందని పేర్కొన్నారు. తాను క్షేమంగా ఉన్నానని.. ఎవరు భయపడాల్సిన అవసరం లేదని క్లారిటీ ఇచ్చారు ఎన్టీఆర్. కిమ్స్ వైద్య బృందానికి తన హృదయపూర్వక ధన్యవాదాలు అంటూ ఎమోషనల్ అయ్యారు. స్నేహితులు, కుటుంబం, ఫ్యాన్స్ మద్దతు తనకు ప్రతిరోజు బలాన్ని ఇస్తుందని...త్వరలో కలుద్దాం అంటూ పోస్ట్ పెట్టారు. ఇక ఎన్టీఆర్ ట్వీట్ చేసిన నేపథ్యంలో ఆయన ఫ్యాన్స్ రియాక్ట్ అవుతున్నారు. అన్నా నువ్వు త్వరగా కోలుకోవాలి..నీ కోసం ఎంతో ఎదురు చూస్తున్నాం అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

## హీరోయిన్స్ కూడా అన్ని చేస్తారని నిరూపిస్తా: సమంత

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ఇటీవల 'మా ఇంటి బంగారం' సినిమాతో గ్రాండ్ సక్సెస్ సాధించిన సంగతి తెలిసిందే. ఆ విజయం తర్వాత ఆమె ప్రెగ్నెంట్ కావడంతో సినిమాలకు కొంత విరామం ఇచ్చారు. ప్రస్తుతం ముంబైలో ఉంటూ తన ప్రెగ్నెన్సీ జర్నీని ఆస్వాదిస్తున్న ఆమె, సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగత విశేషాలను పంచుకుంటూ అభిమానులకు అందుబాటులో ఉంటున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన సామ్, తన కెరీర్ ఆరోగ్య పరిస్థితిపై పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. గతంలో తనకు మయోసైటీస్ వచ్చిందని తెలిసిన ప్రారంభంలో చాలా కలవరపడ్డానని సమంత తెలిపారు. ఇకపై తనను సినిమాల్లోకి తీసుకోవడానికి నిర్మాతలు ఆలోచిస్తారేమోనని, కెరీర్ ఏమవుతుందోనని భయపడినట్లు చెప్పారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి నుంచి బయటపడి తానే సొంతంగా ఒక నిర్మాణ సంస్థను నడిపిస్తున్నానని సంతోషం వ్యక్తం చేశారు.





## టామ్ క్రూజ్‌కు నాపై క్రష్

బాలీవుడ్ నటి మల్లికా శెరావత్ మరోసారి తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. హాలీవుడ్ సూపర్‌స్టార్ టామ్ క్రూజ్‌కు తనపై క్రష్ ఉందని, ఆయన తనకు సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా మెసేజ్‌లు కూడా చేస్తుంటారని ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. త్వరలో ప్రారంభం కానున్న 'ది ట్రెయిటర్స్ 2' అనే రియాలిటీ షోలో ఆమె ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ షోలో తోటి కంటెస్టెంట్ ఆదిత్య కులశ్రేష్ఠ, "మీకు ఎవరిపైనైనా క్రష్ ఉందా? లేక మీపైనే అందరికీ క్రష్ ఉంటుందా?" అని మల్లికాను ప్రశ్నించారు. దీనికి ఆమె స్పందిస్తూ.. "నాపైనే అందరికీ క్రష్ ఉంటుంది. ఇటీవల టామ్ క్రూజ్‌కు కూడా నాపై క్రష్ ఏర్పడింది. నేను అబద్ధం చెప్పడం లేదు. నా దగ్గర ఫోన్ ఉండుంటే, మేమిద్దరం కలిసి పార్టీ చేసుకున్న వీడియోలను మీకు చూపించేదాన్ని" అని బదులిచ్చారు. టామ్ క్రూజ్ అద్భుతమైన వ్యక్తి అని ఆమె కితాబిచ్చారు.

## అతడు అత్యుత్తమం

వరుస హిట్స్‌తో తెలుగు, తమిళ చిత్రాల్లో మోస్ట్ వాటెంట్ హీరోయిన్‌గా దూసుకుపోతున్న యంగ్ బ్యూటీ ప్రీతీ ముకుందన్ నుంచి వస్తోన్న రొమాంటిక్ థ్రిల్లర్ చిత్రం 'అనిబిల్ అవన్'. ఈ మూవీలో అశోక్ సెల్వన్ హీరోగా నటిస్తుండగా,, ఆర్. కార్తికేయన్ దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ మూవీ నంచి ఫస్ట్ లుక్ పోస్టర్‌తో పాటు టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా ప్రీతీ ముకుందన్ సినిమ విశేషాలు పంచుకుంది. 'ముందుగా చెప్పాలంటే.. ఈ స్పీచ్ కోసం నేను ఎలాంటి ప్రిపరేషన్స్ చేసుకోలేదు.. కానీ ఈ రోజు మీ అందరినీ ఇక్కడ చూడటం నాకు చాలా సంతోషంగా ఉంది. ప్రొడ్యూసర్ అభినయ సెల్వమ్ మేడం.. నాపై నమ్మకం ఉంచినందుకు మీకు చాలా ధన్యవాదాలు. అశోక్ సెల్వన్ మీకు ఎలా కృతజ్ఞతలు చెప్పాలో కూడా నాకు నిజంగా తెలియడం లేదు. నేను కలిసి పనిచేసిన అత్యుత్తమ వ్యక్తులలో మీరు ఒకరు.





## జైలులో ఉన్నవాళ్లే మంచివాళ్లు

నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణం తర్వాత ఎదురైన వివాదాల్లో అరెస్ట్ అయి, దాదాపు నెల రోజుల పాటు జైలు జీవితం గడిపిన రియా చక్రవర్తి తన చేదు అనుభవాలను పంచుకున్నారు. కామెడీయన్ తన్మయ్ భట్ యూట్యూబ్ టాక్ షోలో పాల్గొన్న ఆమె, జైలు గోడల మధ్య గడిపిన రోజుల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జైలులో ఖైదీలు సమయాన్ని ఎలా గడుపుతారని తన్మయ్ అడిగిన ప్రశ్నకు రియా సమాధానమిస్తూ.. అక్కడ ఉన్న మహిళలు పాటలు పాడుకుంటూ, డ్యాన్సులు చేస్తూ, 'తేచా' అనే సాంప్రదాయ కారారం తయారుచేసుకుంటూ కాలక్షేపం చేస్తారని చెప్పారు. "బయట ఉన్న మనుషుల కంటే జైలు లోపల ఉండేవారే చాలా మంచివారు. విచారణ ఎదుర్కొంటున్న మహిళా ఖైదీల్లో చాలామంది నిర్దోషులుగా ఉంటారు. అక్కడ ఎలాంటి అంతస్తులు, వ్యత్యాసాలు ఉండవు. అందరూ సమానమే. అక్కడ మనుషులకు పేర్లు ఉండవు, కేవలం నంబర్లు మాత్రమే ఉంటాయి" అని అన్నారు. తనకు కేటాయించిన నంబర్ గుర్తుందా అని ప్రశ్నించగా, చెప్పినప్పటికీ వెంటనే కాస్త నవ్వుతూ గుర్తులేదు అని దాటవేశారు.



## ఎవరికో నచ్చేలా ప్రవర్తించను

నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఇండస్ట్రీని ఊపేస్తోంది. తెలుగు, హిందీ, భాషల్లో వరుస హిట్లు అందుకుంటూ బాక్సాఫీసును షేక్ చేస్తున్నారు. ఇటీవల 'కాక్‌టైల్-2' భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ఆమె ప్రస్తుతం రణబాలి, మైసా వంటి భారీ ప్రాజెక్ట్స్ షూటింగ్స్‌లో పాల్గొంటూ ఫుల్ బిజీగా గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రష్మిక తన వ్యక్తిగత జీవితం, సోషల్ మీడియా ప్రవర్తన, సినిమాల పట్ల ఉన్న భయం గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ రోజుల్లో సోషల్ మీడియాలో నిలబడాలంటే వేరొకరిని అనుకరించడం కాకుండా నిజాయితీగా ఉండడమే కీలకమని రష్మిక చెప్పారు. "ఎవరికో నచ్చడం కోసం ఒక కృత్రిమమైన ఇమేజ్‌ను క్రియేట్ చేసుకోవడం నాకు ఇష్టం ఉండదు. నా సోషల్ మీడియా ఖాతాల్లో నేను ఏది పోస్ట్ చేసినా అది నా నిజ జీవితానికి చాలా దగ్గరగా ఉంటుంది. నా ఆలోచనలు, స్నేహితులతో గడిపే సరదా క్షణాలు, ప్రయాణాల గురించి ఎటువంటి భయం లేకుండా ఓపెన్‌గా షేర్ చేసుకుంటాను. అందుకే ప్రేక్షకులు నన్ను తమ ఇంట్లోని మనిషిలా చూస్తారు" అని ఆమె చెప్పారు.



# ధోనీ.. మళ్లీ ప్రాక్టీస్

భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ మళ్లీ దేశవాళీ క్రికెట్ బరిలోకి దిగనున్నట్లు వార్తలు వస్తున్నాయి. రాబోయే 'లెజెండ్స్ లీగ్ క్రికెట్', ఇండియన్ ప్రీమియర్ లీగ్ తదుపరి సీజన్ కోసం ముందస్తు సన్నాహకాల్లో భాగంగా ధోనీ భారత్‌లో జరిగే ప్రతిష్టాత్మక వన్డే టోర్నీ 'విజయ్ హజారే ట్రోఫీ'లో ఆడనున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పినప్పటికీ ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున మెరుపులు మెరిపిస్తున్న ధోనీ.. మ్యాచ్ ప్రాక్టీస్ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. చాలా కాలంగా కేవలం ఐపీఎల్ మ్యాచ్‌లకే పరిమితమైన ధోనీ, మళ్లీ దేశవాళీ మైదానంలో కనిపిస్తారనే వార్త వినగానే ఆయన అభిమానులు పండుగ చేసుకుంటున్నారు. విజయ్ హజారే ట్రోఫీలో జార్ఖండ్ జట్టు తరఫున ధోనీ బరిలోకి దిగే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రాబోయే లీగ్ టోర్నీల్లో తన ఫిట్‌నెస్, ఫామ్‌ను కాపాడుకునేందుకు ఈ 50 ఓవర్ల ఫార్మాట్ టోర్నమెంట్ ఎంతగానో ఉపయోగపడుతుందని ధోనీ భావిస్తున్నట్లు క్రీడా వర్గాల్లో ప్రచారం సాగుతోంది. కాగా దీనిపై ధోనీ నుంచి ఎటువంటి ప్రకటన వెలువడలేదు.

# ట్రోల్స్ ఆపండి: పీవీ సింధు

సుదీర్ఘ విరామం తర్వాత భారత్ వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌నకు ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధమైంది. దాదాపు పదిహేడేళ్ల తర్వాత తొలిసారి న్యూఢిల్లీ వేదికగా ఈ మెగా టోర్నీని నిర్వహించనున్నారు. ఇందుకు ఆగష్టు 17- 23 మధ్య షెడ్యూల్ ఖరారైంది. ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో ఈ ఈవెంట్‌ను నిర్వహించనుండగా.. కోతుల బెడద సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో కోతులు స్టేడియంలోకి రాకుండా, వాటిని భయపెట్టేందుకు నిర్వాహకులు వింత పద్ధతిని అనుసరించేందుకు సిద్ధమయ్యారు. కోతులను తరిమేందుకు కొండముచ్చుల మాదిరి అరుస్తూ, ఈలల వేసేందుకు ముగ్గురు మనుషులను నియమించారు. అయితే, స్టేడియాలపై విమర్శలు వస్తుండటంపై భారత బ్యాడ్మింటన్ దిగ్గజం, ఒలంపిక్ పతకాల విజేత సింధు స్పందించింది. "వందకు వంద శాతం. అసలు ఈ విమర్శలు ఎందుకు వస్తున్నాయో నాకైతే నిజంగా అర్థం కావడం లేదు. మన అందరికీ వింబుల్డన్ అంటే ఎంతో ఇష్టం. అక్కడ పావురాలను తరిమేందుకు రఫూస్‌ను ఉపయోగిస్తారు. చాలా ఏళ్లుగా అక్కడ ఇదే కొనసాగుతోంది. ప్రతీ ప్రతిష్టాత్మక క్రీడా ఈవెంట్‌కు సంబంధించి స్థానికంగా ఎన్నో సవాళ్లు ఎదురవుతూ ఉంటాయి. ఇక్కడ కొండముచ్చుల మాదిరి శబ్దాలు చేయడం అదనంగా తీసుకున్న ఒక చర్య. అంతకుమించి ఎన్నో మంచి సదుపాయాలు, ఏర్పాట్లు చేశారు. భారత ఆతిథ్యం ఎలా ఉండబోతుందో ప్రపంచానికి తెలియబోతోంది. వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో వరల్డ్ క్లాస్ ఆతిథ్యం ఉంటుందని నేను వంద శాతం నమ్ముతున్నా" అని పీవీ సింధు ఎక్స్ వేదికగా ట్రోల్స్‌కు కౌంటర్ ఇచ్చింది.



# వాషింగ్టన్ సుందర్ దూరం

భారత్, శ్రీలంక మధ్య ఆగస్టు 15వ తేదీ నుంచి టెస్ట్ సిరీస్ ప్రారంభం కానుంది. అయితే ఈ టెస్ట్ సిరీస్ ప్రారంభం కాకముందే భారత జట్టును గాయాల బెడద వేధిస్తోంది. ఇప్పటికే ఈ టోర్నమెంట్ నుంచి బుమ్రా, సాయి సుదర్శన్ దూరమయ్యారు. లేటెస్ట్ గా మరో ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ కూడా టోర్నమెంట్ మొత్తానికి దూరమైనట్లు బీసీసీఐ వర్గాలు స్పష్టం చేశాయి. గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో, వాషింగ్టన్ సుందర్ రెండవ టెస్టు కోసం శ్రీలంకకు వెళ్లే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు బీసీసీఐ వైద్య బృందం కూడా తాజాగా వెల్లడించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని భారత జట్టు యాజమాన్యానికి పలు సూచనలు కూడా చేసిందట. ఇంగ్లాండ్ పర్యటన సందర్భంగా సుందర్ కు గాయమైంది. అయితే శ్రీలంకతో రెండో టెస్ట్ కోసం సుందర్ సిద్ధంగా ఉంటాడని భావించి.. అతడిని సెలెక్ట్ కూడా చేసింది బీసీసీఐ. కానీ ఇప్పుడు చివరి క్షణంలో, అతడు పూర్తిగా కోలుకోలేదని తప్పించారు. సుందర్ పై పని భారం పడకుండా ఉండేందుకు మరో ప్లేయర్ ను తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా వాషింగ్టన్ సుందర్ ఇంగ్లాండ్ తో జరిగిన రెండో వన్డే సందర్భంగా గాయపడ్డాడు. అతను హ్యామ్ స్ట్రింగ్ గాయంతో బాధపడుతున్నాడు.



# కుశాల్ మెండిస్, నిస్సంక ఔట్





## శ్రీలంకకు గట్టి ఎదురుదెబ్బ

**భారత్‌తో టెస్ట్ సిరీస్‌కు ముందు శ్రీలంక జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆగస్టు 15న గాలే వేదికగా ప్రారంభం కానున్న తొలి టెస్టుకు ఆ జట్టు కీలక బ్యాటర్లు కుశాల్ మెండిస్, పతుమ్ నిస్సంక గాయాల కారణంగా దూరమయ్యారు. ఈ నేపథ్యంలో ఆల్‌రౌండర్ ధనంజయ డిసిల్వా సారథ్యంలో 16 మంది సభ్యులతో కూడిన జట్టును శ్రీలంక క్రికెట్ (ఎస్‌-ఎల్‌సీ) బుధవారం ప్రకటించింది.**

గత నెల 19న కొలంబోలో జరిగిన లంక ప్రీమియర్ లీగ్ (ఎల్‌పీఎల్) మ్యాచ్‌లో పరుగు తీస్తుండగా కుశాల్ మెండిస్ కుడి తొడ కండరాలకు గాయమైంది. అప్పటి నుంచి అతను జాతీయ హై-పెర్ఫార్మెన్స్ సెంటర్‌లో కోలుకుంటున్నాడు. మరోవైపు మరో ఓపెనర్ పతుమ్ నిస్సంక గత నెలలో లండన్‌లో మణికట్టుకు చేయించుకున్న శస్త్రచికిత్స నుంచి ఇంకా పూర్తిగా కోలుకోలేదు. దీంతో ఈ ఇద్దరు స్టార్ ఆటగాళ్లు తొలి టెస్టుకు అందుబాటులో లేకుండా పోయారు. ఈ కీలక ఆటగాళ్ల గైర్హాజరీతో సెలక్టర్లు వెటరన్ వికెట్ కీపర్-బ్యాటర్ నిరోషన్ డిక్వెల్లా వైపు మొగ్గు చూపారు. 2023లో చివరిసారిగా టెస్టు ఆడిన డిక్వెల్లా, 54 టెస్టుల అనుభవంతో మళ్లీ జట్టులోకి వచ్చాడు. భారత్‌తో జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఆడిన అంజలా బండార కంటే డిక్వెల్లా అనుభవానికే సెలక్టర్లు ప్రాధాన్యత ఇచ్చారు. ఇదే ప్రాక్టీస్ మ్యాచ్‌లో మూడు వికెట్లు పడగొట్టి ఆకట్టుకున్న ఆఫ్ స్పిన్ ఆల్‌రౌండర్ కేశర నువంతకు తొలిసారిగా టెస్టు జట్టులో చోటు దక్కింది. పేసర్లు కసున్ రజిత, ఇసిత విజేసుందరపై వేటు పడింది. ప్రాక్టీస్ మ్యాచ్‌లో 66, 63 నాటౌట్ స్కోర్లతో రాణించిన నిషాన్ మధుష్క జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. జట్టుకు ధనంజయ డిసిల్వా కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, కమిందు మెండిస్ వైస్-కెప్టెన్‌గా ఎంపికయ్యాడు.

**శ్రీలంక జట్టు:**

ధనంజయ డిసిల్వా (కెప్టెన్), కమిందు మెండిస్ (వైస్ కెప్టెన్), లహిరు ఉదార, నిషాన్ మధుష్క, దినేశ్ చండిమాల్, పసిందు సూరియబండార, సోనాల్ డినుషా, నిరోషన్ డిక్వెల్లా (వికెట్ కీపర్), రమేశ్ మెండిస్, ప్రభాత్ జయసూర్య, కేశర నువంత, మిలన్ రత్నాయకే, అసిత ఫెర్నాండో, లహిరు కుమార, విశ్వ ఫెర్నాండో, దిల్షాన్ మధుశంక.

# దేశవాళీ ఆడితేనే చోటివ్వాలి: కపిల్‌దేవ్



భారత జట్టుకు ఆడే క్రికెటర్లను సెలెక్ట్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలని బీసీసీఐకి కీలక సూచనలు చేశారు కపిల్ దేవ్. ఈ మధ్యకాలంలో భారత సీనియర్లతో పాటు జూనియర్ క్రికెటర్లు స్పిన్ బౌలింగ్ ఎదుర్కోవడంలో విఫలమవుతున్నారని మండిపడ్డారు. స్వదేశంలో కూడా న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టుల్లో భారత్ ఓడిపోవడం దారుణం అన్నారు. ప్రత్యర్థి బౌలర్లు స్పిన్ అద్భుతంగా వేస్తుంటే.. భారత క్రికెటర్లు నిర్లక్ష్యంగా వికెట్లు కోల్పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని అంతటికి కారణం, దేశవాళి క్రికెట్ ఆడక పోవడమని గుర్తు చేశారు. ఐపీఎల్ ఆడిన క్రికెటర్లను కూడా భారత జట్టులోకి తీసుకోవడం వల్ల భారత జట్టుకు నష్టం జరుగుతుందన్నారు. దేశవాళి క్రికెట్ లో అద్భుతంగా రాణించిన వాళ్లను మాత్రమే భారత జట్టులోకి తీసుకోవాలని రిక్వెస్ట్ చేశారు. సీనియర్ క్రికెటర్లు కూడా దేశవాళి క్రికెట్ ఆడేలా బీసీసీఐ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పుడే భారత జట్టు నుంచి మెరుగైన ప్రదర్శన వస్తుందన్నారు. అటు టీ20 మ్యాచ్ లు పెరిగిన నేపథ్యంలో బుమ్రా లాంటి ఫాస్ట్ బౌలర్లు గాయాల బారిన పడుతున్నారని వివరించారు.



# ఇప్పటికైనా కుల్దీప్‌ను తీసుకోవాలి: మురళీ కార్తీక్

భారత జట్టులో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ కు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని మురళీ కార్తీక్ కీలక సూచనలు చేశారు. అప్పుడే భారత్ అద్భుతమైన విజయాలను సాధిస్తుందని బీసీసీఐ, సెలక్షన్ కమిటీ సభ్యులను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. రవీంద్ర జడేజాతో పాటు కుల్దీప్ యాదవ్ జట్టులో ఉంటే గతంలో మెరుగైన ఫలితాలు వచ్చాయని గుర్తు చేశారు. రోహిత్ శర్మ, రాహుల్ ద్రావిడ్ టైంలో కుల్దీప్ యాదవ్ ను బాగా వాడుకున్నారని వివరించారు. దాంతో చాలా మ్యాచ్ లలో భారత్ గెలిచిన విషయాన్ని స్పష్టం చేశారు. కానీ రోహిత్ ను తప్పించిన తర్వాత కుల్దీప్ యాదవ్ కు ఎక్కువగా అవకాశాలు రావడం లేదన్నారు. అతడు మ్యాచ్ విన్నర్ అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఇప్పటికైనా కుల్దీప్ యాదవ్ కు ఎక్కువగా అవకాశాలు ఇచ్చి, భారత జట్టును కాపాడాలన్నారు. శ్రీలంకతో జరిగే టెస్ట్ సిరీస్ నేపథ్యంలో కుల్దీప్ యాదవ్ కూడా ఆడుతున్నాడని వివరించారు.

# కామెంటేటర్‌గా రహానే

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజింక్య రహానే తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతున్నాడు. ఇన్నాళ్లు బ్యాట్‌తో క్రీజ్‌లో పరుగుల వరద పారించిన రహానే, ఇప్పుడు కామెంటరీ బాక్స్‌లో తన గళం వినిపించడానికి సిద్ధమయ్యాడు. ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో ప్రారంభం కానున్న రెండు టెస్టుల సిరీస్‌తో అతను వ్యాఖ్యాతగా అరంగేట్రం చేయనున్నాడు. దాదాపు 18 ఏళ్ల సుదీర్ఘ ఫస్ట్-క్లాస్ కెరీర్‌కు ఇటీవలే వీడ్కోలు పలికిన 37 ఏళ్ల రహానే, ఇకపై ఆటను మరో కోణంలో విశ్లేషించనున్నాడు. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్, సోనీ లివ్‌లో ప్రసారమయ్యే ఈ సిరీస్‌కు అతను కామెంటరీ ప్యానెల్‌లో చేరాడు. భారత్ తరఫున 85 టెస్టులు ఆడిన రహానే 12 సెంచరీలు, 26 అర్ధ సెంచరీలతో 5,077 పరుగులు సాధించాడు. అతని అపార అనుభవం అభిమానులకు ఆటను మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందని భావిస్తున్నారు. ఈ కొత్త బాధ్యతపై రహానే స్పందిస్తూ.. "టెస్ట్ క్రికెట్ అత్యున్నతమైనది. ఇన్నాళ్లు భారత్‌కు ప్రాతినిధ్యం వహించాక, ఇప్పుడు ఆటను మరో కోణం నుంచి చూడటం గౌరవంగా ఉంది. నా అనుభవాలను పంచుకుంటూ, ఆటలోని వ్యూహాలను, కీలక క్షణాలను అభిమానులకు వివరిస్తాను" అని తెలిపాడు. రహానే చేరికతో తమ ప్రసారాలకు మరింత బలం చేకూరుతుందని సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా బిజినెస్ హెడ్ రాజేశ్ కౌల్ ఆశాభావం వ్యక్తం చేశారు.



నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# చంద్రబాబు ఏం నేర్చుకున్నట్లు?

అమరావతి అభివృద్ధి అవసరమే.. కానీ ఏపీ మొత్తం అభివృద్ధి చెందకపోతే రాజధాని నిర్మాణానికి అర్థమేంటి? 2014--19లో ఎదురైన అనుభవాలున్నా 2024--29లోనూ అదే తరహా కేంద్రీకరణ కనిపిస్తోందన్న అసంతృప్తి మిగతా ప్రాంతాల్లో మొదలవుతోంది. ఆంధ్రప్రదేశ్‌కు బలమైన రాజధాని అవసరం. అమరావతి ప్రపంచస్థాయి నగరంగా ఎదగాలి. పెట్టుబడులు రావాలి, పరిశ్రమలు రావాలి, ఉద్యోగాలు పెరగాలి. ఇందులో ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ అసలు ప్రశ్న.. అమరావతితో పాటు రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలు కూడా అదే స్థాయిలో అభివృద్ధి చెందుతున్నాయా? 2014లో రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబు ప్రభుత్వం అమరావతిని రాజధానిగా ప్రకటించి భారీ ప్రణాళికలు రూపొందించింది. రాజధాని నిర్మాణంపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించడంతో ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో తమకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదన్న భావన ఏర్పడింది. 2019లో ప్రభుత్వం మారింది. అమరావతి నిలిచిపోయింది. మూడు రాజధానుల ప్రతిపాదన వచ్చింది. విశాఖకు ప్రాధాన్యం పెరిగింది. మళ్లీ 2024లో చంద్రబాబు అధికారంలోకి రావడంతో అమరావతి పునరుజ్జీవం పొందింది. ఇప్పుడు మళ్లీ అదే ప్రశ్న ఎదురవుతోంది. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్నారా? లేక మరోసారి అమరావతినే అభివృద్ధికి పర్యాయపదంగా మార్చుతున్నారా? రాజధాని నిర్మాణం రాష్ట్ర నిర్మాణానికి సమానం కాదు. ఒక నగరంలో భారీ భవనాలు, విశాల రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించడం అభివృద్ధికి ఒక భాగం మాత్రమే. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో పరిశ్రమలు, ఉద్యోగాలు, విద్య, వైద్యం, సాగునీరు, మౌలిక వసతులు పెరిగినప్పుడే అది సమగ్ర అభివృద్ధి అవుతుంది. విశాఖపట్నం కేవలం మరో నగరం కాదు. అది పారిశ్రామిక, ఐటీ, సముద్ర వాణిజ్య కేంద్రంగా ఎదిగే సామర్థ్యం ఉన్న నగరం. తిరుపతిని ఆధ్యాత్మిక పర్యాటకానికి మాత్రమే పరిమితం చేయకుండా పరిశ్రమలు, విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి చేయవచ్చు. రాయలసీమకు నీరు, పరిశ్రమలు, ఉపాధి అత్యవసరం. ఉత్తరాంధ్రకు పెట్టుబడులు, మౌలిక వసతులు, ఉద్యోగ అవకాశాలు అవసరం. అమరావతి రాష్ట్ర రాజధాని కావచ్చు.. కానీ రాష్ట్ర అభివృద్ధి రాజధానిలోనే ఉండకూడదు. ప్రాంతీయ అసమానతలు పెరిగితే అవి ఆర్థిక సమస్యలుగానే ఉండవు. క్రమంగా రాజకీయ అసంతృప్తిగా మారతాయి. ఒక ప్రాంతానికి అధిక ప్రాధాన్యం దక్కుతోందన్న భావన ప్రజల్లో బలపడితే పాలకులపై వ్యతిరేకత పెరగడం సహజం. గతంలో ఎదురైన పరిణామాల నుంచి ప్రస్తుత ప్రభుత్వం ఇదే పాఠం నేర్చుకోవాలి. అభివృద్ధిని కేవలం భారీ ప్రాజెక్టులతో కొలవకూడదు. ప్రతి జిల్లాలో ఎన్ని ఉద్యోగాలు వచ్చాయి? ఎన్ని పరిశ్రమలు ఏర్పడ్డాయి? యువత వలసలు ఎంత తగ్గాయి? రైతు ఆదాయం ఎంత పెరిగింది? ప్రజలకు విద్య, వైద్యం ఎంత చేరువయ్యాయి? అన్నదే అసలు కొలమానం. చంద్రబాబుకు ఇప్పుడు గతాన్ని సరిదిద్దుకునే అవకాశం ఉంది. అమరావతిని వదిలేయాల్సిన అవసరం లేదు. కానీ దానిని రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ప్రత్యర్థిగా కాకుండా అభివృద్ధి ఇంజిన్‌గా మార్చాలి. అమరావతి నుంచి విశాఖకు, విశాఖ నుంచి రాయలసీమకు, ఉత్తరాంధ్ర నుంచి కోస్తా వరకు అభివృద్ధి ఫలాలు విస్తరించాలి. అమరావతి కోసం ఆంధ్రప్రదేశ్ కాదు.. ఆంధ్రప్రదేశ్ కోసం అమరావతి. ఈ తేడాను చంద్రబాబు గుర్తిస్తేనే 2024-29 పాలన గతానికి భిన్నమైన పాలనగా చరిత్రలో నిలుస్తుంది. లేకపోతే పాఠాలు నేర్చుకోలేదన్న విమర్శ తప్పదు.

# తుప్పురు వాన.. రైతన్నకు రోదన



వాన వస్తోంది..
కానీ పంటకు ప్రాణం పోసేంతగా కాదు
ఆకాశం మేఘావృతమవుతోంది..
కానీ నేలతల్లి దాహం తీరేంతగా కాదు
ఎండల మధ్య ఒక్కసారిగా చినుకులు రాలడం,
కొద్దిసేపటికే మేఘాలు చెదిరిపోవడం..
ఇదే పరిస్థితి అనేక ప్రాంతాల్లో కనిపిస్తోంది.
రైతన్న ఆశగా ఆకాశం వైపు చూస్తున్నాడు.
విత్తనం వేసి చినుకు కోసం ఎదురుచూస్తున్నాడు.
కానీ వస్తున్నది వాన కాదు.. అంతా తుప్పురు
నేలను తడపని వాన..
విత్తనానికి జీవం పోయని వాన..
చెరువులు, కుంటలు నింపని వాన..
రైతన్నకు ఏ మాత్రం ఉపయోగపడని వాన..!



గంగాధర్ బొమ్మకంటి,
ఈవార్తలు దినపత్రిక చైర్మన్

వర్షాకాలం వచ్చిందంటే రైతు ముఖంలో కనిపించాల్సిన ఆనందం ఇప్పుడు ఆందోళనగా మారుతోంది. వానలు పడుతున్నాయా లేదా అన్న ప్రశ్న కంటే, పడుతున్న వాన పంటకు పనికొస్తుందా? అన్న ప్రశ్నే ముఖ్యంగా మారింది. ఒకప్పుడు కాలానుగుణంగా వర్షాలు కురిసేవి. వానాకాలం మొదలైతే వరుసగా వానలు పడేవి. నేలలో తేమ నిలిచేది. చెరువులు నిండేవి. బావుల్లో నీటి మట్టం పెరిగేది. పంటలకు అవసరమైన నీరు అందేది. ఇప్పుడు పరిస్థితి మారుతోంది. ఎప్పుడొస్తుందో తెలియని వాన.. ఎంతసేపు పడుతుందో తెలియని వాన.. ఎక్కడ పడుతుందో కూడా అంచనా వేయలేని వాతావరణం రైతు వ్యవసాయాన్ని అనిశ్చితిలోకి నెట్టేస్తోంది. వ్యవసాయం అనేది కేవలం విత్తనం వేయడం, పంట పండించడం కాదు. అది వర్షం, నేల, నీరు, ఉష్ణోగ్రత, కాలచక్రం మధ్య ఉండే సున్నితమైన సమన్వయం. ఈ సమన్వయంలో చిన్న మార్పు జరిగినా రైతుపై ప్రభావం తీవ్రంగా ఉంటుంది. వర్షం ఆలస్యమైతే విత్తనాలు వేయడం ఆలస్యమవుతుంది. విత్తనం వేసిన తర్వాత తగినంత తేమ లేకపోతే మొలక దశలోనే పంట దెబ్బతింటుంది. మొలక వచ్చిన తర్వాత వానలు ఆగిపోతే మొక్క ఎదుగుదల మందగిస్తుంది. మరోవైపు ఒక్కసారిగా భారీ వర్షం పడితే పొలాల్లో నీరు నిలిచి పంటలు దెబ్బతింటాయి. అంటే రైతుకు ఇప్పుడు వాన లేకపోయినా సమస్యే.. ఎక్కువ వాన వచ్చినా సమస్యే. వాన తీరు మారడమే అసలు సమస్య. తుప్పురు వానలకు మరో ప్రమాదం ఉంది. కొద్దిసేపు పడిన చినుకులు పై మట్టిని మాత్రమే తడుపుతాయి. కానీ నేలలోకి తగినంత నీరు ఇంకదు. పంట వేర్లకు కావాల్సిన తేమ అందదు. రైతు చూసే కళ్లకు మాత్రం పొలం తడిసినట్టే కనిపిస్తుంది. కానీ కొన్ని గంటలకే నేల మళ్లీ పొడిబారుతుంది. రైతు ఆశించిన తేమ అందకపోవడంతో విత్తనాల మొలక శాతం తగ్గవచ్చు. ఇప్పటికే మొలకెత్తిన పంటలో ఎదుగుదల మందగించవచ్చు. దీనికితోడు ఎండ తీవ్రత కొనసాగితే నేలలోని తేమ మరింత వేగంగా ఆవిరైపోతుంది. ఇది కేవలం ఒక పంట సమస్య కాదు. రైతు కుటుంబ ఆర్థిక వ్యవస్థతో ముడిపడిన సమస్య. విత్తనం కొనాలి. ఎరువులు కొనాలి. పురుగుమందులు కొనాలి. దుక్కి దున్నాలి. కూలీలకు డబ్బులు చెల్లించాలి. ట్రాక్టర్ ఖర్చు పెట్టాలి. ఇవన్నీ అప్పు చేసి అయినా రైతు వ్యవసాయంలో పెట్టుబడి పెడతాడు. ఆ తర్వాత పంటను పెంచేందుకు కావాల్సిన నీరు ఆకాశం నుంచి రావాలి. కానీ ఆకాశం కూడా చేతులెత్తేస్తే రైతు పరిస్థితి ఏమిటి? వాన కోసం పెట్టిన పెట్టుబడి.. వాన రాకపోతే అప్పుగా మిగులుతుంది.

వాతావరణ మార్పుల ప్రభావం వ్యవసాయంపై ఎంత తీవ్రంగా పడుతోందో ఇటువంటి పరిస్థితులు చెబుతున్నాయి. భూతాపం పెరుగుతోంది. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పులు వస్తున్నాయి. వాతావరణ వ్యవస్థల్లో అస్థిరత పెరుగుతోంది. ఫలితంగా వర్షపాతం సాధారణ స్థాయిలో ఉన్నప్పటికీ అది పడే సమయం, ప్రాంతం, తీవ్రతలో భారీ మార్పులు వస్తున్నాయి. ఒక ప్రాంతంలో కుండపోత పడుతుంటే.. మరొక ప్రాంతంలో అదే సమయంలో వర్షం కోసం రైతు ఎదురుచూడాల్సి వస్తోంది. వర్షపాతం మొత్తం కంటే వర్షపాతం పంపిణీ వ్యవసాయానికి కీలకమని పాలకులు గుర్తించాల్సిన సమయం వచ్చింది. మన వ్యవసాయ విధానాలు మాత్రం ఇంకా చాలా వరకు పాత అంచనాలపైనే ఆధారపడి ఉన్నాయి. వర్షాలు సమయానికి వస్తాయి.. సాధారణంగా కురుస్తాయి.. కాలం అనుకూలంగా ఉంటుంది అన్న నమ్మకంతో ప్రణాళికలు రూపొందించడం ఇక సరిపోదు. వాతావరణం మారింది.. వ్యవసాయ ప్రణాళిక కూడా మారాలి. రైతుకు ముందస్తు వాతావరణ సమాచారం అందించడం మొదటి అడుగు. కేవలం 'ఈరోజు వర్షం పడే అవకాశం ఉంది' అనే సమాచారం రైతుకు పెద్దగా ఉపయోగపడదు. వచ్చే వారం పరిస్థితి ఎలా ఉంటుంది? వర్షం ఎన్ని రోజులు ఉండొచ్చు? ఎన్ని మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది? విత్తనాలు వేసేందుకు అనుకూలమైన తేమ ఎప్పుడు ఏర్పడుతుంది? పంటకు కీలకమైన దశలో వర్షాభావం ఉంటుందా? వంటి సమాచారం స్థానిక స్థాయిలో రైతుకు అందాలి. వాతావరణ శాఖ, వ్యవసాయ శాఖ, గ్రామస్థాయి యంత్రాంగం కలిసి పనిచేసి పంటల వారీగా, ప్రాంతాల వారీగా వాతావరణ సూచనలు అందించాలి. అలాగే 'వాన వస్తుందా?' అనే ప్రశ్నతో పాటు 'వచ్చిన వానను ఎలా నిల్వ చేసుకోవాలి?' అనే ప్రశ్నకు కూడా సమాధానం వెతకాలి. ప్రతి చినుకును పొలంలో నిలిపే విధానాలు పెరగాలి. చెక్‌డ్యామ్‌లు, కుంటలు, చెరువుల పునరుద్ధరణ, పొలాల వద్ద నీటి నిల్వ గుంతలు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు విస్తరించాలి. పట్టణాల్లో వర్షం పడితే వరదగా మారుతున్న నీటిని గ్రామీణ ప్రాంతాల్లో పంటకు ఉపయోగపడేలా మళ్లించే సమగ్ర ప్రణాళికలు అవసరం.

మన దగ్గర నీటి కొరత మాత్రమే లేదు.. నీటి నిర్వహణ లోపం కూడా ఉంది. ఒక వైపు భారీ వర్షం పడితే వరద నీరు వృథాగా ప్రవహించి నదుల్లోకి వెళ్లిపోతుంది. మరోవైపు కొన్ని వారాల తర్వాత అదే ప్రాంతంలో రైతు బోరు కోసం వందల అడుగులు తవ్వాల్సి వస్తుంది. ఇది ప్రకృతి సమస్య కంటే ఎక్కువగా మన ప్రణాళిక లోపం. వర్షపు నీటిని నేలలోకి ఇంకించే విధంగా గ్రామీణ మౌలిక సదుపాయాలను పునర్నిర్మించాల్సిన అవసరం ఉంది. పంటల ఎంపికలో కూడా మార్పు రావాలి. నీటి లభ్యతను బట్టి పంటలను ఎంచుకునే విధానం బలపడాలి. ఒకే రకమైన అధిక నీటి అవసరమున్న పంటలపై ఆధారపడటం ప్రమాదకరం. తక్కువ నీటితో పండే పంటలు, స్థానిక వాతావరణానికి అనుకూలమైన వంగడాలు, స్వల్పకాలిక పంటలు, చిరుధాన్యాలు వంటి ప్రత్యామ్నాయాలను రైతుకు ప్రోత్సహించాలి. అయితే ఇది రైతుపై బలవంతంగా మోపకూడదు. మార్కెట్ హామీ, కనీస మద్దతు ధర, కొనుగోలు వ్యవస్థ, నిల్వ సదుపాయాలు ఉంటేనే పంటల వైవిధ్యం సాధ్యమవుతుంది. వ్యవసాయ బీమా కూడా వాతావరణ మార్పులకు అనుగుణంగా మారాలి. వర్షం పడకపోవడం మాత్రమే కాదు.. అతి తక్కువ వ్యవధిలో అసాధారణ వర్షపాతం, వర్షపాతం మధ్య విరామాలు, ఉష్ణోగ్రతల తీవ్ర మార్పులు వంటి పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకునే విధంగా బీమా వ్యవస్థ ఉండాలి. రైతు పంట దెబ్బతిన్న తర్వాత పరిహారం కోసం నెలల తరబడి తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నష్టాన్ని త్వరగా అంచనా వేసి పరిహారం రైతు ఖాతాలో జమ చేసే వ్యవస్థ అవసరం.

ఇక్కడ మరో ముఖ్యమైన విషయం ఉంది. వానల కోసం రైతు ఆకాశం వైపు చూడటం తప్పనిసరి కాకూడదు. వ్యవసాయానికి నీటి భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత. సాగునీటి ప్రాజెక్టులు, కాలువలు, చెరువులు, భూగర్భజలాల సంరక్షణ, సూక్ష్మ సేద్యం, వర్షపు నీటి సంరక్షణ వంటి అంశాలను విడివిడిగా కాకుండా ఒకే నీటి విధానంలో భాగంగా చూడాలి. నీరు ఉన్నప్పుడు నిల్వ చేసుకోవడం.. లేనప్పుడు సమర్థంగా వినియోగించడం అనే రెండు సూత్రాలు వ్యవసాయ విధానానికి పునాది కావాలి. తుప్పురు వానలను చూసి రైతన్నను నిందించడం సులువు. 'సమయానికి విత్తనం వేయలేదా?', 'పంట మార్చుకోవాల్సింది కదా?' అని ప్రశ్నించడం కూడా సులువే. కానీ రైతు పరిస్థితిని అర్థం చేసుకోవాలి. విత్తనాలు, ఎరువులు, మార్కెట్, కూలీల ధరలు, రుణాలు, పంట ధరలు.. అన్నీ ముందుగానే నిర్ణయించుకోవాల్సిన రైతుకు వర్షం మాత్రం అతని చేతిలో ఉండదు. ఆకాశాన్ని నియంత్రించలేం.. కానీ ఆకాశం మారినప్పుడు రైతును కాపాడే వ్యవస్థను మాత్రం నిర్మించగలం. రైతన్నకు కావాల్సింది కేవలం వాన కాదు.. నమ్మదగిన వాన, నిల్వ చేసుకునే నీరు, శాస్త్రీయ సలహా, సరైన పంట ప్రణాళిక, నష్టానికి రక్షణ, పండించిన పంటకు గిట్టుబాటు ధర. ఇవన్నీ కలిసినప్పుడే వ్యవసాయం నిలబడుతుంది. ప్రతి చినుకు విలువైనదే. కానీ చినుకు నేలను తాకి ఆవిరైపోతే దాని ప్రయోజనం పరిమితమే. ఆ చినుకు భూమిలోకి ఇంకాలి. భూగర్భ జలంగా మారాలి. చెరువులో నిలవాలి. పంట వేర్లకు చేరాలి. రైతు చెమటతో కలవాలి. అప్పుడే అది వాన అవుతుంది.. రైతు జీవితానికి వరం అవుతుంది.

ఇప్పటికైనా ప్రభుత్వాలు వర్షపాతాన్ని కేవలం గణాంకంగా చూడటం మానాలి. 'సాధారణం కంటే ఇన్ని శాతం ఎక్కువ.. ఇన్ని శాతం తక్కువ' అనే లెక్కలతో రైతు కడుపు నిండదు. వర్షం ఎంత పడింది అన్నదానికంటే.. రైతు పొలానికి ఎంత నీరు చేరింది అన్నదే అసలు కొలమానం. వర్షపాతం నమోదైంది అని ప్రభుత్వ రికార్డుల్లో కనిపించినా.. ఆ వాన రైతు పంటకు ఉపయోగపడకపోతే ఆ గణాంకానికి అర్థమేంటి? వాతావరణం మనకు ఒక హెచ్చరిక ఇస్తోంది. నిన్నటి వ్యవసాయ క్యాలెండర్ రేపటి వ్యవసాయానికి సరిపోకపోవచ్చు. రుతువులు మారుతున్నాయి. వానల తీరు మారుతోంది. ఉష్ణోగ్రతలు మారుతున్నాయి. అందుకే వ్యవసాయ ఆలోచన కూడా మారాలి. లేకపోతే ఆకాశం నుంచి పడేది చినుకులే అయినా.. రైతు కళ్ల నుంచి జారేది కన్నీళ్లే అవుతాయి. తుప్పురు తుప్పురు వానలు రైతన్నకు పనికిరావు. రైతన్నకు కావాల్సింది వాన కోసం ఎదురుచూపు కాదు.. వానను నమ్ముకునే భరోసా. ఆ భరోసాను ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే.

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.